www.vishalabharati.com
epaper.vishalabharati.com

శనివారం, హైదరాబాద్
24 అక్టోబర్ 2026
సంపుటి:4 సంచిక: 287

# విశాల భారతి

తెలుగు దినపత్రిక

## హైదరాబాద్ ప్రతిష్ట మసకబారుతోంది!

### గ్లోబల్ నగరాల జాబితాలో 421వ స్థానం



- ఆర్థిక, మానవ వనరుల్లో మెరుగైన ర్యాంకులు
- జీవన ప్రమాణాల విభాగంలో భారీ పతనం
- పెరిగిపోయిన ఇళ్ల అద్దెలు, జీవన వ్యయం
- కాలుష్యం, ట్రాఫిక్‌తో పర్యావరణ సమస్యలు
- మౌలిక వసతుల కోసం దీర్ఘకాలిక ప్రణాళికలు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**
ఆక్స్‌ఫర్డ్ ఎకనామిక్స్ గ్లోబల్ సిటీస్ ఇండెక్స్ 2026 నివేదికలో హైదరాబాద్ ర్యాంకింగ్ భారీగా పడిపోయింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న వెయ్యి నగరాలను పరిశీలిస్తే భాగ్యనగరం 421వ స్థానంలో నిలిచింది. దేశంలోని ప్రధాన నగరాలతో పోలిస్తే ఇది చాలా వెనుకబడిన పరిస్థితిగా మారింది. ఢిల్లీకి 268వ స్థానం దక్కగా బెంగళూరు 311వ స్థానాన్ని సొంతం చేసుకుంది. ముంబై 330వ స్థానంలో నిలవగా చెన్నై 381వ స్థానాన్ని దక్కించుకుంది. ఈ నగరాలన్నింటితో పోల్చి చూస్తే హైదరాబాద్ అంతర్జాతీయ స్థాయిలో చాలా వెనుకబడి ఉంది. ఈ తాజా పరిణామాలు మిగతా 3లో..



## కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాలు

వచ్చే ఏడాది గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు

కాంగ్రెస్ ఏకపక్ష నిర్ణయంపై మిత్రపక్షాల అసంతృప్తి

సీపీఐ, టీజేఎస్ ఉమ్మడి అభ్యర్థి బరిలోకి వ్యూహం

వామపక్షాల ప్రభావంతో కాంగ్రెస్‌లో ఆందోళన

మిత్రపక్షాలను దారికి తెచ్చేందుకు బుజ్జగింపులు

నేతల చర్చల ఫలితంపై తేలనున్న పొత్తులు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**
వచ్చే ఏడాది ఆరంభంలో రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల కోసం ఓటరు నమోదు ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థులను కూడా ప్రకటించేసింది. ఎలాగైనా ఈ ఎన్నికల్లో గెలిచి తమ పట్టు మిగతా 3లో..



## గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ బరిలో రామచందర్ రావు

- మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ బరిలో రామచందర్ రావు
- సర్వే నివేదికల ఆధారంగా అధిష్టానం నిర్ణయం
- 2028 ఎన్నికల వరకు కొనసాగే పార్టీ ఊపు
- నల్గొండ-వరంగల్-ఖమ్మం స్థానంపై కసరత్తు
- రాష్ట్రంలో రాజకీయ ప్రభావాన్ని పెంచే వ్యూహం
- అధికార, ప్రతిపక్ష పార్టీలకు గట్టి పోటీ

03



కరువొస్తుందని

## భయపెట్టేవాడు పాలకుడా?

- కరువు నివారణకు కేటాయించిన డేటా విడుదల చేయాలి
- రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించాలి
- పశువులకు పశుగ్రాసం, కూలీలకు ఉపాధి కల్పించాలి

02

### ఇక తాగు నీరే..

# సాగుకు నీళ్లిచ్చే ఛాన్సే లేదు

### మన ప్రాజెక్టుల్లో 20 శాతం కూడా నీళ్లు లేవ్

వచ్చే సీజన్‌లో కూడా చుక్క నీరు దొరకదు

ఈ విషయాన్ని ప్రజలకు చెప్పకపోతే అన్నిరకాలుగా దెబ్బతింటం

మహారాష్ట్రలో మంచినీటిని రేషన్‌లా ఇస్తున్నరు

ప్రజాభవన్ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

ఎల్‌నినో కరువు పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రంలో తాగు నీటికి తప్పా సాగుకు నీరిచ్చే ఛాన్సే లేదని సీఎం రేవంత్‌రెడ్డి తేల్చి చెప్పారు. ప్రాజెక్టుల్లో 20 శాతం నీరు కూడా లేదన్నారు. ప్రాజెక్టుల్లో 200 టీఎంసీల నీళ్లు కూడా లేవని.. వచ్చే సీజన్‌లో చుక్క నీరు కూడా దొరకదని చెప్పారు. ఈ విషయాన్ని ప్రజలకు చెప్పకుంటే అన్ని రకాలుగా దెబ్బతింటామన్నారు. మహారాష్ట్రలో మంచినీటిని రేషన్‌లా ఇస్తున్నారని.. ప్రతి మనిషి 20 శాతం నీటి వినియోగాన్ని తగ్గించాలనే నిబంధనలు పెట్టారని తెలిపారు. ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. 8 నుంచి 10 నెలల పాటు ఈ కరువును ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. ఎల్‌నినో అంటే ఏదో భూతం కాదు.. కరువు. ప్రపంచంలోని చాలా దేశాలు కరువును ఎదుర్కొన్నాయి.



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**
ఎండ వేడి విపరీతంగా పెరుగుతుంది.. నీళ్లు అందుబాటులో ఉండవు. ఎండ వేడి, నీటి కొరత వల్ల విద్యుత్ వినియోగం బాగా పెరుగుతుంది. పీపుల్స్ రిప్రజెంటేషన్ యాక్ట్‌ను డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపరిచారు. ఎస్ఐఆర్ ప్రక్రియను బీజేపీ దురుద్దేశంతో ఉపయోగించుకుంటోంది. ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా పేదల హక్కులను కాలరాసి, అధికారాన్ని శాశ్వతం చేసుకోవాలని నరేంద్ర మోదీ ప్రయత్నిస్తున్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై పేదల పక్షాన రాహుల్ గాంధీ పోరాడుతున్నారు. నవంబర్ 1న ఢిల్లీలో రాహుల్ గాంధీ భారీ సభ నిర్వహిస్తున్నారు. తెలంగాణ నుంచి ఈ సభకు 10 వేల నుంచి 15 వేల మంది తరలి వెళ్లాలి. కాంగ్రెస్‌కు ఎన్నికలు కొత్త కాదు.. ప్రభుత్వాలను ఏర్పాటు చేయడం కొత్త కాదు. కొన్ని సందర్భాల్లో ఓడినా, రెట్టించిన ఉత్సాహంతో మళ్లీ పోటీ చేసి గెలిచింది. ప్రకృతి వైపరీత్యాలు మూడు రకాలు.. కరువు, వరదలు, భూకంపాలు. వీటిని మనం నివారించలేం. భూకంపం వల్ల అపార నష్టం జరుగుతుంది. కరువు ప్రారంభమైనప్పుడు దాని ప్రభావం అంతగా తెలియదు. కరువుపై ఆరు నెలల నుంచి ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. కాంగ్రెస్ తెచ్చిన కరువు అని, కాంగ్రెస్ వల్లే కరువు వచ్చిందని కొందరు మాట్లాడుతున్నారు. రాజకీయ దురుద్దేశంతో కూడిన ప్రకటనలను కొందరు చేస్తున్నారు. దేశంలోని మహారాష్ట్ర, ఏపీ, తమిళనాడు వంటి రాష్ట్రాలతో పాటు ప్రపంచంలోని 100 దేశాలపై ఎల్‌నినో ప్రభావం ఉంది. మామ, అల్లుళ్లు మాత్రమే మేధావులా? బ్రిటన్ లాంటి దేశంలో కూడా ఎల్‌నినో వల్ల కరువును ఎదుర్కొంటున్నారు. అక్టోబర్‌లో మొదలైన కరువు జూలై వరకు ఉంటుంది. ఎండ వేడి పెరుగుతుంది.. నీటి ఆవిరి పెరుగుతుంది.. నీటి సమస్య వస్తుంది. సాగునీటి కంటే తాగునీటికే

మిగతా 2లో..



## మళ్లీ కేసీఆరే సీఎం

- జాతీయ రాజకీయాల్లో కేసీఆర్ కీలక పాత్ర
- రాష్ట్రంలో త్వరలో మళ్లీ కేసీఆర్ సీఎం
- కాంగ్రెస్ వైఫల్యంతో తీవ్ర విద్యుత్ కోతలు
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో యువత తగిన బుద్ధి
- దేశంలో ప్రత్యామ్నాయ రాజకీయాలదే భవిష్యత్తు
- తెలంగాణ ఎంపీల మౌనంపై తీవ్ర విమర్శ

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** గత కొన్ని రోజులుగా తెలంగాణ రాజకీయాల్లో ఒక పెద్ద చర్చ నడుస్తోంది. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇటీవల కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్ లోని తెలంగాణ భవనంలో జరిగిన అంబర్‌పేట నియోజకవర్గ ముఖ్య నేతల సమావేశంలో ఆయన ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ కేసీఆర్ పాత్ర త్వరలో జాతీయ స్థాయిలో కచ్చితంగా ఉంటుందని చెప్పారు. మిగతా 2లో..



## సరాకా ఫ్యాక్టరీని మూసేయండి

- సంగారెడ్డి జిల్లా గడ్డపోతారంలో ప్రమాదం
- సరాకా లేబొరేటరీస్‌లో క్లోరోఫామ్ లీక్
- ఇద్దరు కార్మికులు మృతి
- ఫ్యాక్టరీ మూసివేతకు పీసీబీ ఆదేశాలు
- విద్యుత్ సరఫరా నిలిపివేత

02

## పేదలకు నగరంలోనే ఇళ్లు

### క్యూర్ పరిధిలో ఇందిరమ్మ టవర్ల భూ సేకరణ

- మూడు దశల్లో లక్ష ఇందిరమ్మ ఫ్లాట్ల నిర్మాణం
- ఈ నెలాఖరు నాటికి పారదర్శక లబ్ధిదారుల ఎంపిక
- యూట్యూబ్‌లో లాటరీ ప్రక్రియ ప్రత్యక్ష ప్రసారం
- ఫ్లాట్లపై పూర్తి యాజమాన్య హక్కులు, ఉచిత రిజిస్ట్రేషన్
- ఉపాధి మార్గాలకు సమీపంలోనే పేదలకు గృహాలు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో ప్రతిపాదించిన ఇందిరమ్మ టవర్ల నిర్మాణం కోసం యుద్ధప్రాతిపదికన భూములను సేకరించాలని రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మిగతా 3లో..



రైతు పంటకు కరెంటు కరువు..

## కాంగ్రెస్ హామీలకు కాలం చెల్లిందా?

- మూడు సార్లు మోటారు దగ్ధం
- రెండెకరాల వరి పంటను కాపాడుకునేందుకు ట్యాంకర్లతో నీళ్లు!
- లో వోల్టేజీతో రైతుకు నష్టం..
- విద్యుత్ సరఫరాపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదా?
- కందికొండ రైతు దారావత్ వెంకన్న ఆవేదన

06



## సాగునీటి ప్రాజెక్టులపై రేవంత్ సర్కార్ కసరత్తు

- తుమ్మిడిహెట్టి బ్యారేజీపై మహారాష్ట్రతో చర్చలకు ఆదేశం
- 152 మీటర్ల ఎత్తుతో రెండు లక్షల ఎకరాలకు సాగునీరు
- మహారాష్ట్రలో ముంపు అంచనాలపై సాంకేతిక నివేదికలు
- డిండి ప్రాజెక్టుకు ఏదుల నుంచి 0.5 టీఎంసీల నీరు
- అచ్చంపేట ఎత్తిపోతలకు 0.1 టీఎంసీల కేటాయింపు
- శ్రీశైలం నుంచి అదనపు నీటి తరలింపుపై అధ్యయనం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**
తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం పెండింగ్ పనులపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నీటిపారుదల శాఖ అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ, డిండి, అచ్చంపేట, ఎత్తిపోతల పథకాలపై కీలక ఆదేశాలు జారీ చేశారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరిపేందుకు పూర్తిస్థాయి సమాచారంతో సిద్ధంగా

మిగతా 3లో..

# కరువొస్తుందని భయపెట్టేవాడు పాలకుడా?

- కరువు నివారణకు కేటాయించిన డేటా విడుదల చేయాలి
- రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించాలి
- పశువులకు పశుగ్రాసం, కూలీలకు ఉపాధి కల్పించాలి
- నష్టపోయిన రైతులకు తక్షణమే పరిహారం అందించాలి
- రైతు బీమా, పంటల బీమాలను తక్షణమే అమలు చేయాలి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



కరువొస్తుందని చేతులెత్తేసేవాడు పాలకుడు ఎలా అవుతాడని.. ప్రజలను భయపెట్టడం ఆపి కరువును ఎదుర్కొనే కార్యాచరణను ప్రకటించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ప్రజలను కాపాడేందుకు ఎంతకైనా తెగించేవాడే నిజమైన పాలకుడవుతాడని చెప్పారు. రాష్ట్రంలోని ప్రాజెక్టుల వారీగా నీటి నిల్వలు, తాగునీటి అవసరాలు, సాగునీటి పరిస్థితి, కరువు నివారణకు కేటాయించిన నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎల్‌నినోపై సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలపై శుక్రవారం హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ఫైరయ్యారు.

**చేతులు కాలాక ఆకులు పట్టుకోవడమే**

అసమర్థుడికి అధికారం అప్పగిస్తే.. ఇల్లు పీకి పందిరి వేసినట్టుగా ఉంది రేవంత్ పాలన! కరువు రాగానే చేతులెత్తేసిన చేతగాని సీఎంగా రేవంత్ చరిత్రలో మిగిలిపోతాడు. రంకెలు వేసినంత మాత్రాన నిజం అబద్ధం అయిపోదు రేవంత్ రెడ్డి. ఇది ప్రకృతి తెచ్చిన కరువు కాదు.. ముమ్మాటికీ కాంగ్రెస్ చేతగానితనం వల్ల వచ్చిన కరువే. మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేతులు కాలాక ఆకులు పట్టుకోవడమే. రైతులకు, ప్రజలకు భరోసా ఇవ్వడం మానేసి భయభ్రాంతులకు గురిచేస్తావా రేవంత్ రెడ్డి? కరువు వస్తోంది.. నేనేం చేయలేనని చేతులెత్తేసేవాడా పాలకుడు? తాగునీళ్లు కూడా ఉండవని భయపెట్టడానికేనా రేవంత్‌కు సీఎం పదవి ఉన్నది?

**మీ కార్యాచరణ ఏందో చెప్పు**

ఇప్పుడు కేసీఆర్ సీఎంగా ఉంటే.. రేవంత్‌లాగా పనికిమాలిన, చేతగాని మాటలు చెప్పేవారా? వచ్చిన నీటిని వచ్చినట్టుగా ఒడిసిపట్టి.. తెలంగాణకు కరువు రాకుండా కేసీఆర్ చూసేవారు. ముందస్తు చర్యలు తీసుకొని కరెంటు కోతలు నివారించేవారు. ఎల్‌నినో గురించి ఆరు నెలలుగా ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని చెబుతున్న మీరు.. ఈ ఆరు నెలల్లో కరువు నివారణకు తీసుకున్న ముందస్తు చర్యలేంటో చెప్పగలరా రేవంత్ రెడ్డి? కరువు ప్రకృతి సృష్టి కావచ్చు.. కానీ కరువును ఎదుర్కొనే ప్రణాళిక రూపొందించడం, ప్రజలకు భరోసా కల్పించడం ప్రభుత్వ బాధ్యత కాదా? ప్రజలను భయపెట్టడం కాదు.. భరోసా ఇవ్వాలి. నీటి నిల్వలు, విద్యుత్, ప్రత్యామ్నాయ పంటలు, పశుగ్రాసం, ఉపాధి అంశాలపై మీ కార్యాచరణ ఏంటి? కరువు వస్తుందని ఆరు నెలలుగా తెలుసని చెబుతున్నారు.. మరి గోదావరి, కృష్ణా నదుల నుంచి నీళ్లను ఎందుకు ఎత్తిపోలేదు? ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు ఎందుకు పెంచుకోలేదు? బొగ్గు నిల్వలు లేవు, కరెంట్ సంక్షోభం వస్తుందని మేం మొత్తుకుంటుంటే.. ఎందుకు ఫిడేలు వాయిస్తూ కూర్చున్నారు? ఈరోజు రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులకు మీ చేతగానితనం కారణం కాదా? ఎందుకు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు? ఎల్‌నినో ప్రపంచవ్యాప్త సమస్య అయితే.. పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో ఎందుకు కరువు లేదు? అక్కడ ఎందుకు నీటి గలగలలు.. ఇక్కడ ఎందుకు రిజర్వాయర్లు వెలవెలబోతున్నాయి? కరువు పేరుతో వ్యవసాయానికి నీళ్లు ఇవ్వలేమని ముందే చేతులెత్తేయడం పాలనా దక్షత కాదు.. రైతులను సంక్షోభంలోకి నెట్టడమే! 20 వేల మెగావాట్ల విద్యుత్ వినియోగాన్ని గొప్పగా చెబుతున్నారు.. అదే సమయంలో విద్యుత్ కోతలతో ఎండుతున్న పంటల గురించి ఎందుకు మాట్లాడటం లేదు? ట్యాంకర్లతో నీళ్లు పోసుకుంటున్న రైతుల గోస కనిపించడం లేదా? బియ్యం ధరలు అడ్డగోలుగా పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే.. దాన్ని కూడా తన ఘనతగా చెప్పుకునే భావదారిద్ర్యం రేవంత్ రెడ్డిది. ఇలాంటి వ్యక్తి కరువు నుండి ప్రజలను కాపాడతారా ప్రజలు ఆలోచించాలి. ప్రజల సమస్యలపై ప్రశ్నిస్తే వ్యక్తిగత దూషణలు.. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపితే రాజకీయ విమర్శలు.. ఇదేనా మీ ప్రజాపాలన? కరోనా సమయంలో కేసీఆర్ తీసుకున్న చర్యలపై మాట్లాడే ముందు.. నేటి కరువు పరిస్థితిని ఎదుర్కొనేందుకు మీ ప్రభుత్వం ఏం చేసిందో చెప్పండి. కరోనా కాలంలో కేసీఆర్ తీసుకున్న చర్యలపై ప్రపంచమంతా ప్రశంసలు వెల్లువెత్తాయి. వ్యాక్సిన్ అందేలా చేసి, చేయడంతో పాటు తన మాటలు, చర్యలతో ప్రజలను భరోసా ఇచ్చారు. వలస కూలీలను కూడా తెలంగాణ బిడ్డలుగా భావించి కాపాడారు కేసీఆర్. కేసీఆర్ చర్యలను దేశమంతా కొనియాడింది. దాన్ని కూడా తప్పుగా చూపించేందుకు రేవంత్ దగుల్బాజీ మాటలు మాట్లాడుతున్నారు. కేసీఆర్‌పై విమర్శలు చేయడానికి చూపిస్తున్న శ్రద్ధలో పావంతైనా రైతులకు, ప్రజలకు నీళ్లు అందించడంపై చూపించండి. కరువు నివారణకు చర్యలు తీసుకోలేని రేవంత్‌కు ముఖ్యమంత్రిగా ఉండే అర్హత ఎక్కడిది? రాజకీయాల కోసం పుట్టిన గడ్డనే కరువు రక్కసికి బలిపెట్టిన ప్రజా వ్యతిరేకి, రైతు వ్యతిరేకి రేవంత్ కాదా? ఇంతా చేసి సిగ్గులేకుండా బుకాయింపు మాటలతో ఎవరిని మోసం చేస్తావ్ రేవంత్? నన్ను, కేసీఆర్‌ను తిట్టినంత మాత్రాన, నా పొడుగు గురించి మాట్లాడినంత ప్రాజెక్టుల్లో నీళ్లు పెరగవు. కరెంట్ సమస్య తీరదు. రాష్ట్రంలోని ప్రాజెక్టుల వారీగా నీటి నిల్వలు, తాగునీటి అవసరాలు, సాగునీటి పరిస్థితి, కరువు నివారణకు కేటాయించిన నిధులపై శ్వేతపత్రం విడుదల చేయండి. రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు, పశువులకు పశుగ్రాసం, కూలీలకు ఉపాధి కల్పించండి. నష్టపోయిన రైతులకు పరిహారం అందించండి. రైతులకు రైతు బీమా, పంటలకు పంట బీమా పథకాలను తక్షణ అమలు చేయండి. ప్రకృతి వైపరీత్యాన్ని రాజకీయాలకు వాడుకోవడం కాదు.. ప్రజలకు అండగా నిలవడం ప్రభుత్వ బాధ్యత అన్న విషయాన్ని ఇకనైనా గుర్తించండి అని హరీశ్ రావు హితవు పలికారు.

## ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన కల్పించాలి: సీఎం రేవంత్ రెడ్డి



- మంత్రులు, ఎమ్మెల్యేలతో సమావేశంలో కీలక దిశానిర్దేశం
- సమావేశంలో పాల్గొన్న నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి

**విశాలభారతి, నిజామాబాద్ ప్రతినిధి :**

తెలంగాణ రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం వల్ల వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశాల నేపథ్యంలో వ్యవసాయ రంగంపై దాని ప్రభావాన్ని అంచనా వేస్తూ, రైతులకు తగిన సూచనలు అందించడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మంత్రులు, ఎమ్మెల్యేలతో నిర్వహించిన సమావేశంలో వ్యవసాయ పరిస్థితులు, రైతులకు అవగాహన కల్పించాల్సిన అంశాలు, ప్రతిపక్షాల ఆరోపణలను సమర్థవంతంగా తిప్పికొట్టడంపై నేతలకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి పాల్గొన్నారు.

**రైతులకు ముందస్తు అవగాహన కల్పించడంపై దృష్టి**

ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం, ఉష్ణోగ్రతలు, నీటి లభ్యతలో మార్పులు సంభవించే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ రంగానికి సంబంధించి ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరాన్ని సమావేశంలో చర్చించారు. ముఖ్యంగా నీటి లభ్యత, సాగునీటి వనరులు, వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని రైతులకు వ్యవసాయ శాఖ అధికారుల ద్వారా సరైన సూచనలు అందించాలని సీఎం నేతలకు దిశానిర్దేశం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో వరి సాగు విషయంలో రైతులు ఆచితూచి నిర్ణయం తీసుకునేలా అవగాహన కల్పించడం, నీటి లభ్యతకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు వివరించడం వంటి అంశాలపై ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు సమావేశంలో చర్చించారు. రైతులకు నష్టం కలగకుండా, అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకునేలా వ్యవసాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, వ్యవసాయ రంగానికి సంబంధించిన నిర్ణయాలపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలకు వాస్తవాల ఆధారంగా సమాధానం ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి మంత్రులు, ఎమ్మెల్యేలకు సూచించినట్లు తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న సంక్షేమ ఫలాలు, రైతుల ప్రయోజనాల కోసం తీసుకుంటున్న చర్యలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేశారు.

# సరాకా ఫ్యాక్టరీని మూసేయండి



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం గడ్డపోతారం గ్రామంలోని సరాకా లేబొరేటరీస్ పరిశ్రమలో గురువారం రాత్రి పదకొండు గంటల ముప్పై నిమిషాలకు ఘోరమైన ప్రమాదం జరిగింది. పరిశ్రమలో జరిగిన క్లోరోఫామ్ లీకేజీ కారణంగా ఇద్దరు ఉద్యోగులు ప్రాణాలు కోల్పోయారు. రాత్రి షిఫ్ట్ సమయంలో జరిగిన ఈ ఘటన అందరినీ కలచివేసింది. క్లోరోఫామ్ ఆవిరిగా మారి ఆ ప్రాంతమంతా వేగంగా వ్యాపించింది. దీంతో శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారి ఇద్దరు కార్మికులు వెంటనే అపస్మారక స్థితిలోకి వెళ్ళిపోయారు. తోటి సిబ్బంది వారిని గమనించి హుటాహుటిన సమీపంలోని నారాయణ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి చేరేసరికి పరిస్థితి విషమించడంతో వైద్యులు పరీక్షించి వారు చనిపోయినట్లు ధృవీకరించారు. మృతి చెందిన వారిలో పరిశ్రమకు చెందిన కీలక సిబ్బంది ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రమాద వార్త తెలియగానే స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లనే ఈ ప్రాణ నష్టం జరిగిందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని బాధితుల కుటుంబాలు ఆరోపిస్తున్నాయి. కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఇలాంటి పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకోవాలని అందరూ కోరుతున్నారు. ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి ఇలాంటి ఫ్యాక్టరీలపై నిఘా పెంచాల్సిన అవసరం చాలా ఉంది. భవిష్యత్తులో ఇలాంటి ప్రాణ నష్టాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అందరూ భావిస్తున్నారు. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలి అని కోరుతున్నారు. పరిశ్రమకు చెందిన జనరల్ మేనేజర్ మధు డిప్యూటీ జనరల్ మేనేజర్ యోగేశ్వర్ రావు శుక్రవారం నాడు టీజీపీసీబీ అధికారులకు ఈ ప్రమాదం గురించి పూర్తి వివరాలు వెల్లడించారు. గురువారం రాత్రి పదకొండు గంటల ముప్పై నిమిషాలకు ఈ ప్రమాదం జరిగినట్లు వారు స్పష్టం చేశారు. పరిశ్రమలోని ప్రొడక్షన్ బ్లాక్ రెండులో ఈ ఘటన చోటుచేసుకుంది. మొదటి అంతస్తులో ఉన్న రియాక్టర్ నుంచి గ్రౌండ్ ఫ్లోర్‌లోని రిసీవర్‌కు క్లోరోఫామ్ బదిలీ చేసే సమయంలో ఈ ప్రమాదం సంభవించింది. క్లోరోఫామ్ బదిలీ జరిగే ప్రక్రియలో లేయర్ సెపరేషన్ జరుగుతున్న సమయం ఇది. ఆ సమయంలోనే అనూహ్యంగా క్లోరోఫామ్ లీకేజీ జరిగిందని అధికారులు వివరించారు. లీకైన రసాయనం చాలా వేగంగా ఆ ప్రాంతమంతా పూర్తిగా వ్యాపించింది. దీనివల్ల అక్కడ ఉన్న సిబ్బంది ఊపిరి పీల్చుకోలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పరిశ్రమలో భద్రతా నిబంధనలు సరిగ్గా పాటించకపోవడం వల్లనే ఈ లీకేజీ తీవ్ర రూపం దాల్చింది. సాంకేతిక లోపాలు ఎక్కడ వచ్చాయనే అంశంపై కూడా అధికారులు ఆరా తీస్తున్నారు. పరిశ్రమ నిర్వహణలో ఉన్న లోపాలను గుర్తించేందుకు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. బాధ్యులైన ప్రతి ఒక్కరిపై తగిన చర్యలు ఉంటాయని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా చూసేందుకు కఠినమైన నిబంధనలు అమలు చేయాలని నిర్ణయించారు. రసాయన పరిశ్రమల నిర్వహణలో తప్పులు జరగకుండా నిరంతరం పర్యవేక్షణ ఉండాలని భావిస్తున్నారు. ఈ ఘటన తీవ్రతను పూర్తిగా పరిగణలోకి తీసుకున్న తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి సరాకా లేబొరేటరీస్ లిమిటెడ్ పరిశ్రమ పైన తక్షణ చర్యలు ప్రారంభించింది. నిబంధనలను తీవ్రంగా ఉల్లంఘించిన కారణంగా ఈ పరిశ్రమకు ముందస్తు విచారణ అవకాశం కల్పించకుండానే మూసివేత ఉత్తర్వులు జారీ చేసింది. ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు యాజమాన్యాలకు ఎలాంటి వెసులుబాటు ఇవ్వకూడదని బోర్డు నిర్ణయించింది. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే ఫ్యాక్టరీలపై అత్యంత కఠినంగా వ్యవహరించాలని ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. మూసివేత ఆదేశాలు అందుకున్న వెంటనే పరిశ్రమ నిర్వహణ నిలిచిపోయింది. ఫ్యాక్టరీలో ఉన్న మిగిలిన కార్మికులను బయటకు పంపించి గేట్లు మూసివేశారు. ప్రభుత్వ ఆదేశాలు వెలువడిన తక్షణమే తదుపరి చర్యలు వేగవంతం అయ్యాయి. ఏ క్షణంలోనూ ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఇలాంటి కఠిన నిర్ణయాలు తీసుకోవడం వలన భవిష్యత్తులో యాజమాన్యాలు భయపడతాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు కార్మికుల భద్రత కూడా అత్యంత కీలకమని అధికారులు గుర్తు చేస్తున్నారు. ఈ దిశగా తదుపరి విచారణ కొనసాగుతోంది. పరిశ్రమ అనుమతులపై కూడా బోర్డు ప్రత్యేక నిఘా పెట్టింది. భద్రతా నిబంధనలు పాటించని ఇతర ఫ్యాక్టరీలపై కూడా త్వరలో ఉక్కుపాదం మోపాలని యోచిస్తున్నారు. కార్మికుల భద్రతకు పెద్దపీట వేయాలని ప్రభుత్వం పదే పదే హెచ్చరిస్తోంది. ఫ్యాక్టరీ మూసివేత ఆదేశాలతో పాటు విద్యుత్ సరఫరాను తక్షణమే నిలిపివేయాలని సంగారెడ్డి పరిధిలోని అధికారులను టీజీపీసీబీ ఆదేశించింది. దీనికోసం తెలంగాణ స్టేట్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ అధికారులకు అధికారికంగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. పవర్ సప్లై ఆగిపోతేనే పరిశ్రమలో ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోతుందని అధికారులు భావిస్తున్నారు. విద్యుత్ కనెక్షన్ తొలగింపు ప్రక్రియను వెంటనే అమలు చేయాలని పవర్ కార్పొరేషన్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. పరిశ్రమ యాజమాన్యం ఎలాంటి అనధికారిక కార్యకలాపాలు నిర్వహించకుండా ఈ చర్య ఎంతైనా అవసరమని పేర్కొన్నారు. విద్యుత్ నిలిచిపోవడం వల్ల ఫ్యాక్టరీలో ఉన్న మిగతా యంత్రాలు అన్నీ శాశ్వతంగా ఆగిపోతాయి. దీనితో ప్రమాదాలు పునరావృతం అయ్యే అవకాశం పూర్తిగా తొలగిపోతుందని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

## పొరపాట్లకు తావులేకుండా జనాభా లెక్కలు సేకరించాలి

- సమాచార గోప్యతను కచ్చితంగా పాటించాలి: కలెక్టర్ రాహుల్ శర్మ

**విశాలభారతి, భూపాలపల్లి :**

జిల్లాలో జనాభా లెక్కల సేకరణను సమగ్రంగా, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఐడీఓసీ సమావేశ మందిరంలో నిర్వహించిన జనాభా లెక్కల సేకరణ ఫేజ్-2 శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గతంలో హౌస్ లిస్టింగ్, ఫేజ్-1 ప్రక్రియను విజయవంతంగా నిర్వహించారని, అదే స్ఫూర్తితో తదుపరి దశను పూర్తి చేయాలని సూచించారు. జనగణనలో సేకరించే వివరాలు భవిష్యత్తు ప్రణాళికలు, అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పనకు కీలకమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలన్నారు. ఈసారి డిజిటల్ విధానానికి ప్రాధాన్యం ఉంటుందని, మొబైల్ యాప్ ద్వారా వివరాలు నమోదు చేయనున్నట్లు తెలిపారు. స్వీయ గణన సదుపాయం, కులాలవారీ వివరాల సేకరణకు సంబంధించిన అంశాలపై సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు సంబంధిత మాన్యువల్‌ను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సందేహాలను నివృత్తి చేసుకోవాలని, పరిష్కారం కాని అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. ప్రతి ఇంటి వివరాలను నిబంధనల ప్రకారం కచ్చితంగా నమోదు చేయాలన్నారు. జనగణన చట్టం-1948 ప్రకారం సేకరించిన సమాచారాన్ని అత్యంత గోప్యంగా ఉంచాలని కలెక్టర్ సూచించారు. వివరాలను అనధికార వ్యక్తులతో పంచుకోవద్దని ఆదేశించారు.

# మళ్లీ కేసీఆరే సీఎం




మొదటి పేజీ తరువాయి

దేశ రాజకీయాల్లో ఆయన చక్రం తిప్పే సమయం చాలా దగ్గరలోనే ఉందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వ హడావిడి కేవలం కొద్దిరోజులు మాత్రమే ఉంటుందని స్పష్టం చేశారు. ఆ తర్వాత కేసీఆర్ మళ్లీ మన రాష్ట్రానికి ముఖ్యమంత్రి పీఠం అధిష్టించడం పూర్తిగా ఖాయమని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో ఇప్పుడు తీవ్ర వ్యతిరేకత వస్తోందని వారు తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు ఇప్పుడు మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్ని ఎంతో బలంగా కోరుకుంటున్నారని ఈ సమావేశంలో ఆయన చాలా స్పష్టంగా వివరించి అందరికీ తెలియజేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాలలో పూర్తిగా విఫలమైందని కేటీఆర్ తీవ్రంగా ఆరోపించారు. తీవ్రమైన విద్యుత్ కోతల కారణంగా రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆయన వెల్లడించారు. అన్నదాతల కష్టాలను పట్టించుకోవడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శలు గుప్పించారు. ఎల్‌నినో ప్రభావం పడుతుందని నిపుణులు పది నెలల ముందే హెచ్చరికలు జారీ చేసినా ప్రభుత్వం స్పందించలేదు. ముందస్తు చర్యలు చేపట్టడంలో పెద్ద వైఫల్యం చెందిందని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నమ్మి మోసపోయిన ప్రతి ఒక్కరూ ఇప్పుడు తిరిగి చూస్తున్నారు. ప్రజలు అంతా మళ్లీ బీఆర్ఎస్ వైపు చూస్తున్నారని ఆయన స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి హడావిడి మాటలు ఇంకొద్దిరోజులు మాత్రమే సాగుతాయని ఆయన హెచ్చరించారు. ఈ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందు ఎండగట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై పోరాటాలు చేయడానికి అందరూ సిద్ధంగా ఉండాలని కోరారు. రాబోయే రోజుల్లో మంచి రోజులు వస్తాయని ఆయన ధైర్యం చెప్పారు. జాతీయ రాజకీయాల గురించి ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ కేటీఆర్ కొన్ని కీలకమైన విషయాలు చెప్పారు. భవిష్యత్తులో కాంగ్రెస్ అలాగే బీజేపీ కాకుండా ఇతర ప్రాంతీయ పార్టీలే దేశంలో నిర్ణయాత్మక పాత్ర పోషిస్తాయని ఆయన జోస్యం చెప్పారు. రాహుల్ గాంధీ ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రజల నుంచి ఎలాంటి ఆశించిన ఫలితం ఉండదని తేల్చి చెప్పారు. అటు ప్రధాని మోదీ పాలనలో కూడా దేశానికి ఎలాంటి ప్రయోజనం చేకూరలేదని ఆయన తీవ్రంగా విమర్శించారు. మన రాష్ట్ర ప్రయోజనాల కోసం తెలంగాణ నుంచి గెలిచిన ఎంపీలు ఎవరూ పార్లమెంటులో గళం విప్పడం లేదని ఆయన దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రశ్నించడంలో వారు అసలు విఫలమయ్యారని మండిపడ్డారు. తెలంగాణ హక్కులను కాపాడటంలో నేతలు వెనుకడుగు వేశారని ఆయన పేర్కొన్నారు. ప్రజలు ఇవన్నీ గమనిస్తున్నారని తగిన సమయంలో తగిన తీర్పు ఇస్తారని తెలిపారు. దేశం కోసమే కేసీఆర్ అహర్నిశలు పోరాటం చేస్తున్నారని ఆయన గుర్తుచేశారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి యువత తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రభుత్వ వైఫల్యాలు రోజురోజుకూ పెరిగిపోవడం వల్లే నేడు యువత రోడ్లపైకి వచ్చి పోరాటాలు చేయాల్సి వస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని ఆయన మండిపడ్డారు. కేవలం ప్రతిపక్ష నాయకులను విమర్శించడమే తమ ప్రధాన పనిగా ఆ పార్టీ నేతలు పెట్టుకున్నారని ఆరోపించారు. యువతకు ఇచ్చిన ఉద్యోగాల హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని తెలిపారు. ఉద్యోగాలు రాక నిరుద్యోగులు తీవ్ర నిరాశలో కూరుకుపోయారని ఆయన స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో ఓటు ద్వారా యువత తమ ఆగ్రహాన్ని ప్రభుత్వానికి తెలియజేయాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ యువత వెంటే ఉంటుందని ఆయన భరోసా కల్పించారు. చివరగా కేటీఆర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేశారని విమర్శించారు. అభివృద్ధి పనులను పక్కన పెట్టి కేవలం ప్రతిపక్ష నాయకులపై విమర్శలు చేయడమే వారి ప్రధాన ఎజెండాగా మారిందని మండిపడ్డారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని త్వరలోనే తగిన గుణపాఠం చెబుతారని ఆయన జోస్యం చెప్పారు. తెలంగాణ ప్రజల ఆశీస్సులు ఎప్పుడూ బీఆర్ఎస్ పార్టీ వెంటే ఉంటాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ నాయకత్వంలోనే రాష్ట్రం మళ్లీ బంగారు తెలంగాణగా మారుతుందని స్పష్టం చేశారు. ప్రతి కార్యకర్త పార్టీ గెలుపు కోసం సైనికులా పనిచేయాలని పిలుపునిచ్చారు. మనమందరం కలిసికట్టుగా పోరాడితే విజయం మనదే అవుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న నాయకులందరికీ ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. అందరి కృషితో పార్టీ మళ్లీ అధికారం లోకి రావడం తథ్యమని చెప్పారు.

## ఇక తాగు నీరే.. సాగుకు నీళ్లిచ్చే ఛాన్సే లేదు

కష్టాలు వస్తాయి. సమస్య చిన్నగా మొదలై పెద్దదిగా మారుతుంది. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడుతుంది. ప్రజలను అప్రమత్తం చేయకుండా, వారిని భాగస్వాములను చేయకుండా ఈ కరువును ఎదుర్కోలేం. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో సబ్‌కమిటీని ఏర్పాటు చేశాం. తప్పుడు ప్రచారాన్ని ఎదుర్కోవడానికి రామకృష్ణారావును ఎల్‌నినోపై ప్రత్యేక అధికారిగా నియమించాం. 2019లో కరోనా వచ్చింది. కరోనా గురించి అసెంబ్లీలో చర్చ జరిగినప్పుడు, ఎండ కొడితే, క్రోసిన్ వేసుకుంటే పోతుందని కేసీఆర్ దబాయించి మాట్లాడారు. కరోనాను సీసాలో వేసి బంధిస్తానన్నట్లుగా కేసీఆర్ మాట్లాడారు. లక్షలాది మంది కరోనాతో చనిపోయారు. శ్మశానాల్లో స్థలం లేని పరిస్థితి ఏర్పడింది. ముఖ్యమంత్రి స్థాయిలో కేసీఆర్ అసెంబ్లీలో మాట్లాడితే ప్రజలు నమ్మారు. బాధ్యత లేకుండా కరోనాపై మాట్లాడటం వల్ల చాలా మంది శ్మశానాలకు వెళ్లారు. కేసీఆర్ మాటలు నమ్మినవాళ్లు ఈ రోజు బతికి ఉన్నారు. కాంగ్రెస్ తెచ్చిన కరువు అంటున్న హరీశ్ రావును నమ్ముకుని పంటలు వేసుకుంటే, మట్టి పోసి అంబలి తాగాల్సి వస్తుంది. తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలి.. ప్రజల్లో అవగాహన కల్పించాలి. కోట్లాది మంది వలస కార్మికులు కరోనా సమయంలో సొంత ప్రాంతాలకు వెళ్లిపోయారు. ఉపాధి హామీ పథకం ఆ నాడు ఆకలి తీర్చింది. మతం పేరుతో విడగొట్టి అధికారంలోకి రావాలని మోదీ అంటున్నారు.. మానవత్వాన్ని కూడగట్టి అధికారంలోకి రావాలని మనం అంటున్నాం. కరోనా సమయంలో మోదీ ఏం చెప్పినా చేశాం. ప్రకృతి సృష్టించిన విపత్కర పరిస్థితి ఎల్‌నినో. వానాకాలంలో ఎలాంటి సమస్య లేదు. కానీ మూడు నెలల తర్వాత సమస్యలు మొదలయ్యాయి. వానాకాలం పంటల నుంచి బయటపడ్డాం. ఉమ్మడి రాష్ట్రంలో కూడా ఈ సీజన్‌లో 13 వేల మెగావాట్ల కంటే ఎక్కువ విద్యుత్ వినియోగం కాలేదు. ఈ సీజన్‌లో 20 వేల మెగావాట్ల విద్యుత్ వినియోగం జరిగింది. ప్రతి ఏడాది ఆరున్నర శాతం విద్యుత్ వినియోగం పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. కానీ ఈసారి ఊహించకుండా 20 శాతం వరకు విద్యుత్ వినియోగం పెరిగింది. అధికారులు 24 గంటలు కష్టపడి విద్యుత్ సరఫరా చేస్తున్నారు. ఈ విషయంలో భట్టి విక్రమార్కను, అధికారులను అభినందిస్తున్నాను. 20 వేల మెగావాట్ల విద్యుత్‌ను భట్టి విక్రమార్క, విద్యుత్ అధికారులు అందుబాటులోకి తీసుకొచ్చారు. నాకాలం పంటలను ఏదో రకంగా రక్షిస్తాం.. కొనుగోలు చేస్తాం. ఏడు రకాల సన్న వడ్లు పండిస్తే బోనస్ ఇస్తామని గత సీజన్‌లో చెప్పాం. సన్న వడ్లను ఏడు రకాలకే పరిమితం చేయడం బోనస్ ఎగ్గొట్టడానికేనని హరీశ్ రావు ఆరోపించారు. మార్కెట్‌లో రూ.3,400 నుంచి రూ.4,000 వరకు ఇతర రాష్ట్రాల వ్యాపారులు అడ్వాన్స్‌లు ఇచ్చి కొనుగోలు చేస్తున్నారు. ప్రజలు నమ్మి ఏడు రకాల సన్న వడ్లు పండించినందుకు అత్యధిక ధర వచ్చింది. కేటీఆర్, హరీశ్ రావు బద్నాం చేశారు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో కూర్చుని ప్రణాళికలు వేస్తే, కేటీఆర్, హరీశ్ రావు అమలు చేస్తున్నారు. మనిషి పెరిగితే ఆలోచన పెరుగుతుందని అనుకోవడం అవగాహనారాహిత్యమే. తాటి చెట్టులా పెరిగినా ఆలోచన పెరగని వాడే హరీశ్ రావు. వడ్ల ధరలు పెరిగితే ఆటోమేటిక్‌గా బియ్యం ధరలు పెరుగుతున్నాయి. ఈ విషయం హరీశ్ రావుకు తెలియదా? కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు వాస్తవాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. 30 లక్షల పంప్‌సెట్లలో 15 లక్షలు ఎండిపోయాయి.



# గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ బరిలో రామచందర్ రావు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



తెలంగాణలో త్వరలో జరగనున్న గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికలపై అన్ని రాజకీయ పార్టీలు ప్రత్యేక దృష్టి పెట్టాయి. ముఖ్యంగా మహబూబ్ నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ నియోజకవర్గంపై బీజేపీ గట్టి పట్టు సాధించాలని చూస్తోంది. ఈ స్థానం నుంచి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచందర్ రావును బరిలోకి దించాలని హైకమాండ్ తీవ్రంగా ఆలోచిస్తోంది. త్వరలోనే ఈ విషయమై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేసే కమలదళం ఇక్కడ కూడా అదే వ్యూహాన్ని అమలు చేస్తోంది. కేంద్ర నాయకత్వం వివిధ సర్వే నివేదికలను పరిశీలించి ఆయన పేరును ఖరారు చేసింది. గతంలో ఇదే స్థానం నుంచి ఎమ్మెల్సీగా పనిచేసిన అనుభవం ఆయనకు పెద్ద బలంగా మారింది. పట్టభద్రులు నిరుద్యోగులు మేధావి వర్గాల్లో ఉన్న పరిచయాలు పార్టీకి కలిసి వస్తాయని నేతలు భావిస్తున్నారు. ఈ కీలక నిర్ణయం ద్వారా క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణుల్లో నూతన జోరు పెంచవచ్చని కమలనాథులు బలంగా భావిస్తున్నారు. ప్రస్తుతం పార్టీ కార్యకలాపాలు అలానే కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరసన కార్యక్రమాలతో ఎన్ రామచందర్ రావు చాలా బిజీగా ఉన్నారు. అందువల్ల మొదట్లో ఆయన ఈ పోటీ పట్ల అంత ఆసక్తి చూపలేదని సమాచారం అందుతోంది. అయినప్పటికీ పార్టీ శ్రేణుల్లో పూర్తిస్థాయిలో జోష్ నింపడానికి, విజయ అవకాశాలను మరింత మెరుగుపరచడానికి బలమైన నాయకుడిని బరిలో నిలపాలని అధిష్టానం నిర్ణయించింది. ఈ మేరకు ఆయనను ఒప్పించే ప్రయత్నాలు విజయవంతం అయ్యాయని తెలుస్తోంది. సీనియర్ నేత బరిలో ఉంటే పార్టీ క్యాడర్‌లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని అగ్రనేతలు భావించారు. విపక్షాల విమర్శలను దీటుగా తిప్పికొట్టడానికి ఈ అభ్యర్థిత్వం ఎంతో ఉపయోగపడుతుందని నాయకులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో త్వరలోనే ప్రచార పర్వం ఊపందుకోనుంది. పట్టభద్రుల సమస్యలపై పోరాటం చేస్తూ ముందుకు వెళ్లాలని నేతలు నిర్ణయించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించడానికి ఈ ఎన్నికలు మంచి వేదికగా మారుతాయి. గతంలో కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ గ్రాడ్యుయేట్స్ అలానే టీచర్స్ నియోజకవర్గాల ఎన్నికల్లో సాధించిన విజయాలతో బీజేపీ శ్రేణుల్లో జోరు విపరీతంగా పెరిగింది. రాబోయే 2028 అసెంబ్లీ ఎన్నికల వరకూ ఇదే ఊపును కొనసాగించాలని పార్టీ గట్టిగా భావిస్తోంది. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల్లోని పట్టభద్రులు లాయర్లు వివిధ రంగాల నిపుణుల మద్దతును కూడగట్టుకోవడం ద్వారా ఈ స్థానాన్ని సులభంగా కైవసం చేసుకోవాలని చూస్తోంది. పట్టభద్రుల సమస్యల పరిష్కారం కోసం తాము మాత్రమే సరైన వేదిక అని నిరూపించుకోవాలని భావిస్తున్నారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్రచారంతో పాటు ఇంటింటి ప్రచారానికి కూడా ప్రత్యేక వ్యూహాలు రచిస్తున్నారు. అనుభవజ్ఞులైన నాయకుల మార్గదర్శకత్వంలో ముందుకు వెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. గెలుపు లక్ష్యంగా ప్రతి కార్యకర్త శ్రమించాలని నాయకులు పిలుపునిచ్చారు. ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేస్తూ ముందుకు సాగుతున్నారు. మరోవైపు నల్గొండ, వరంగల్ ఖమ్మం గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గంలోనూ అభ్యర్థి ఎంపికపై బీజేపీ తీవ్రంగా కసరత్తు చేస్తోంది. గత ఎన్నికల్లో నాలుగో స్థానానికి పరిమితమైన చోట ఈసారి బలమైన అభ్యర్థిని బరిలోకి దింపాలని చూస్తోంది. ఇది తెలంగాణ రాజకీయాల్లో బీజేపీ తన పరిధిని విస్తరించుకోవడానికి చేస్తున్న తీవ్ర ప్రయత్నానికి చక్కటి నిదర్శనంగా నిలుస్తోంది. అన్ని ప్రాంతాల్లోనూ పార్టీ పటిష్టతను చాటేందుకు ఈ ఎన్నికలను ఒక సువర్ణావకాశంగా భావిస్తున్నారు. అధికార పార్టీ విధానాలపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను అనుకూలంగా మలచుకోవాలని కమలదళం వ్యూహ రచన చేస్తోంది. క్షేత్రస్థాయిలో ఓటర్లను ఆకట్టుకునేందుకు త్వరలోనే ప్రత్యేక కార్యాచరణను ప్రకటించనున్నారు. సీనియర్ నాయకుల పర్యటనలు కూడా ఏర్పాటు చేసే అవకాశం కనిపిస్తోంది. ప్రతి ఓటరును కలిసి మద్దతు కోరాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ ఎన్నికల ఫలితాలు రాబోయే రోజుల్లో రాజకీయ సమీకరణాలను పూర్తిగా మార్చగలవని నమ్ముతున్నారు. మొత్తంగా చూస్తే గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికలను కేవలం శాసనమండలి స్థానాల భర్తీగా కాకుండా రాష్ట్రంలో తమ రాజకీయ ప్రభావాన్ని బేరీజు వేసే వేదికగా బీజేపీ మలుచుకుంటోంది. రామచందర్ రావు లాంటి సీనియర్ నేతను రంగంలోకి దించడం ద్వారా అధికార కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలకు గట్టి పోటీ ఇవ్వాలని కమలదళం వ్యూహరచన చేస్తోంది. ఈ ఎన్నికల ఫలితాలు రాబోయే కాలంలో రాష్ట్ర రాజకీయ సమీకరణాలను ఏ విధంగా ప్రభావితం చేస్తాయనేది ప్రస్తుతం తీవ్ర ఆసక్తికరంగా మారింది. అందరి చూపు ఈ ఎన్నికల ఫలితాలపైనే నిలిచింది. పార్టీ శక్తిసామర్థ్యాలను పరీక్షించుకోవడానికి ఇది సరైన సమయమని నేతలు భావిస్తున్నారు. భవిష్యత్తు రాజకీయ భవితవ్యాన్ని నిర్ణయించే కీలక మైలురాయిగా ఈ ఎన్నికలు నిలుస్తాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కనుక అన్ని పార్టీలు చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ఎవరికి వారు గెలుపు కోసం సర్వశక్తులు ఒడ్డుతున్నారు.

# హైదరాబాద్ ప్రతిష్ట మసకబారుతోంది



**మొదటిపేజీ తరువాయి**

నగర అభివృద్ధి మౌలిక వసతులపై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. గతంలో మోస్ట్ లివబుల్ సిటీస్ జాబితాలో అగ్రస్థానంలో ఉన్న నగరం పరిస్థితి ఇప్పుడు పూర్తిగా మారిపోయింది. అంతర్జాతీయ స్థాయిలో వెనుకడుగు వేయడం పౌరులను తీవ్రంగా ఆశ్చర్యపరుస్తోంది. ఆర్థిక రంగంలోనూ మానవ వనరుల కేటగిరీలోను హైదరాబాద్ నగరం తన సత్తా చాటింది. నగర ఆర్థిక వ్యవస్థ విభాగంలో ఏకంగా 248వ స్థానాన్ని సొంతం చేసుకుంది. అలానే హ్యూమన్ క్యాపిటల్ విభాగంలో కూడా 241వ స్థానాన్ని కైవసం చేసుకోగలిగింది. నగరంలో వరుసగా పెరుగుతున్న జీడీపీ తలసరి ఆదాయం ఉపాధి వృద్ధి, బలమైన కార్పొరేట్ ఎకోసిస్టమ్ ఇందుకు ప్రధాన కారణాలుగా నిలిచాయి. నగరంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలు నిపుణులైన శ్రామిక శక్తి నైపుణ్య ఆధారిత విద్య వలన హ్యూమన్ క్యాపిటల్ విభాగంలోనూ చాలా మంచి పురోగతి సాధించింది. టెక్ కంపెనీల రాకతో ఉద్యోగ అవకాశాలు విపరీతంగా పెరిగిపోయాయి. యువతకు ఉపాధి లభించడంలో ఈ నగరం ఎప్పుడూ ముందంజలో ఉంటోంది. అయితే కేవలం ఆర్థిక రంగం మాత్రమే కాకుండా ఇతర అంశాలపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆర్థికంగా దూసుకుపోతున్న హైదరాబాద్ నగరం సామాన్య ప్రజల జీవన ప్రమాణాల విషయానికి వచ్చేసరికి తీవ్రంగా వెనుకబడింది. ఈ విభాగంలో నగరం ఏకంగా 818వ స్థానానికి పడిపోయింది. ఆదాయ అసమానతలు, తలసరి ఆదాయ వ్యత్యాసాలు గృహ వసతి యుటిలిటీ ఖర్చులు విపరీతంగా పెరగడం దీనికి ప్రధాన కారణాలుగా నిలిచాయి. అంతేకాకుండా నగరంలో నేరాల రేటు, ఆరోగ్య రక్షణ సదుపాయాలు, వినోద, సాంస్కృతిక సౌకర్యాల లభ్యత వంటి అంశాలు తీవ్రంగా నిరాశపరిచేలా ఉన్నాయి. సామాన్యులకు ఇళ్ల అద్దెలు భరించలేని స్థాయికి చేరాయి. విద్యుత్, నీటి బిల్లులు విపరీతంగా పెరుగుతుండటంతో మధ్యతరగతి కుటుంబాలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. రాత్రి సమయాల్లో తిరగడానికి కొన్ని ప్రాంతాలలో భయపడే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. మంచి ఆసుపత్రులు అందుబాటులో ఉన్నప్పటికీ పేదలకు వైద్యం చాలా ఖరీదైనదిగా మారిపోయింది. పార్కులు క్రీడా మైదానాలు వంటి వినోద సౌకర్యాలు కూడా నగరంలో చాలా తక్కువగా ఉన్నాయి. ఈ సమస్యలన్నీ పౌరుల జీవితాలను మరింత దుర్భరంగా మారుస్తున్నాయి. పర్యావరణ విభాగంలో హైదరాబాద్ నగరం 657వ స్థానాన్ని దక్కించుకుంది. ముంబై 782వ స్థానంలో నిలవగా ఢిల్లీ 915వ స్థానంలో నిలిచాయి. అయితే 528వ స్థానంలో ఉన్న బెంగళూరుతో పోలిస్తే హైదరాబాద్ చాలా వెనుకబడి ఉంది. గాలి నాణ్యత, ఉద్గారాల తీవ్రత ప్రకృతి వైపరీత్యాల ముప్పు వంటి కీలకమైన ప్రమాణాలను ఈ కేటగిరీ కింద అంచనా వేశారు. నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న కాలుష్యం దెబ్బతింటున్న రహదారులు తీవ్రమైన ట్రాఫిక్ రద్దీ వంటి సమస్యలు పౌరుల జీవన నాణ్యతను మరింత దిగజార్చుతున్నాయి. చెట్లు నరికివేత విపరీతంగా పెరగడం వలన పచ్చదనం కరువవుతోంది. వర్షాలు పడినప్పుడు రోడ్లపై నీరు నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఫ్లైఓవర్లు మెట్రో రైళ్లు వచ్చినప్పటికీ ట్రాఫిక్ కష్టాలు మాత్రం ఎక్కడా తగ్గడం లేదు. వాహనాల నుంచి వెలువడే పొగ కారణంగా గాలి నాణ్యత దెబ్బతిని శ్వాసకోశ వ్యాధులు ప్రబలుతున్నాయి. నగర వేగవంతమైన విస్తరణ ప్రజల అవసరాలకు తగినట్లుగా లేదనే విమర్శలు తీవ్రంగా వ్యక్తమవుతున్నాయి. కేవలం ఆర్థికాభివృద్ధి మాత్రమే కాకుండా దానికి తగినట్లుగా మౌలిక సదుపాయాలు మెరుగైన ప్రజా రవాణా వ్యవస్థ పర్యావరణ పరిరక్షణపై నిరంతరం పెట్టుబడులు పెట్టాలని అర్బన్ ప్లానర్స్ గట్టిగా హెచ్చరిస్తున్నారు. నగరంలోని ఆర్థిక మానవ వనరుల బలాలను ప్రజల మెరుగైన జీవన ప్రమాణాలుగా మలచాలంటే ప్రభుత్వాలు పట్టణాభివృద్ధి సంస్థలు సమన్వయంతో దీర్ఘకాలిక ప్రణాళికలు అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. భవిష్యత్తులో భాగ్యనగరాన్ని మరింత సురక్షితమైన నివాసయోగ్యమైన ప్రాంతంగా మార్చడానికి రాజకీయ నాయకులు అధికారులు కలిసికట్టుగా పని చేయాల్సి ఉంటుంది. ప్రజల సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేలా కొత్త పాలసీలను తీసుకురావాలి. అప్పుడే హైదరాబాద్ తన పూర్వవైభవాన్ని మళ్లీ దక్కించుకునే అవకాశం ఉంటుంది. లేదంటే గ్లోబల్ నగరాల పోటీలో మనం మరింత వెనుకబడిపోయే ప్రమాదం పొంచి ఉంది.

# సాగునీటి ప్రాజెక్టులపై రేవంత్ సర్కార్ కసరత్తు



**మొదటిపేజీ తరువాయి**

ఉండాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా 152 మీటర్ల ఎత్తుతో బ్యారేజీ నిర్మాణం చేపట్టే ప్రతిపాదనపై సాంకేతిక వివరాలు నీటి లభ్యత ముంపు ప్రభావానికి సంబంధించిన నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. తుమ్మిడి హెట్టి బ్యారేజీ నిర్మాణం ద్వారా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని రైతులకు సాగునీరు అందించాలన్నది ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో కనీసం రెండు లక్షల ఎకరాలకు నీటిని అందించేలా ప్రాజెక్టు ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తుతో బ్యారేజీ నిర్మిస్తే ఎంత నీటిని వినియోగించుకోవచ్చనే అంశంపై ఇంజినీర్లు ముఖ్యమంత్రికి ప్రత్యేకంగా ప్రజెంటేషన్ ఇచ్చారు. 150 మీటర్ల ఎత్తుతో నిర్మిస్తే కలిగే ప్రయోజనాలు గతంలో ప్రతిపాదించిన 148 మీటర్ల ఎత్తుతో పోలిస్తే నీటి లభ్యతలో వచ్చే తేడాలను కూడా పరిశీలించినట్లు సమాచారం అందుతోంది. బ్యారేజీ ఎత్తు పెరిగే కొద్దీ మహారాష్ట్ర పరిధిలో భూములు ముంపునకు గురయ్యే అవకాశాలు ఉన్నందున ఈ అంశంపై స్పష్టమైన నివేదిక అవసరమని ప్రభుత్వం గట్టిగా భావిస్తోంది. అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం 152 మీటర్ల ఎత్తు ప్రతిపాదనతో సుమారు 2,300 ఎకరాల భూమి ముంపునకు గురికావచ్చు. 150 మీటర్ల ఎత్తుతో ఈ విస్తీర్ణం కేవలం వెయ్యి ఎకరాల లోపు ఉండవచ్చని అధికారులు అంచనా వేసినట్లు తెలుస్తోంది. ఈ విషయాలన్నింటిపైన సమగ్రమైన అధ్యయనం పూర్తిచేసి ప్రభుత్వానికి త్వరలోనే పూర్తి నివేదికను అందజేయాలని ముఖ్యమంత్రి వారికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మహారాష్ట్రలో ముంపు ప్రభావాన్ని తగ్గిస్తూనే తెలంగాణకు గరిష్ఠంగా నీటి ప్రయోజనం కలిగే మార్గాలను గుర్తించాలని సీఎం రేవంత్ రెడ్డి నీటిపారుదల శాఖ అధికారులకు సూచించారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుతో పాటు డిండి, అచ్చంపేట ఎత్తిపోతల పథకాలపైనా ఈ సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా చర్చించారు. డిండి ప్రాజెక్టుకు ఏదుల రిజర్వాయర్ నుంచి 0.5 టీఎంసీల నీటిని అందించే ప్రతిపాదనను పరిశీలించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అచ్చంపేట ఎత్తిపోతల పథకానికి 0.1 టీఎంసీల నీటిని కేటాయించే అంశంపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ రెండు పథకాలకు అవసరమైన నీటిని సమకూర్చే క్రమంలో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు కేటాయించిన నీటికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా తగిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అన్నారు. శ్రీశైలం నుంచి అదనంగా 0.6 టీఎంసీల నీటిని నార్లాపూర్ మీదుగా ఏదుల రిజర్వాయర్‌కు తరలించే అవకాశాలను పరిశీలించాలని అధికారులకు తెలిపారు. అదనపు నీటిని తరలించేందుకు అవసరమైన పంప్‌హౌస్‌లు పంపులు ఇతర మౌలిక సదుపాయాలపై అధ్యయనం చేసి పనులకు సంబంధించిన ప్రణాళికలను సిద్ధం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. నీటి సరఫరా వ్యవస్థల సామర్థ్యం కాలువల నిర్మాణం సాంకేతిక అవసరాలను కూడా నిపుణులు పరిశీలించాల్సి ఉందని పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని రైతులకు సాగునీరు అందించడంతో పాటు డిండి అచ్చంపేట ప్రాంతాల్లోని నీటి అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం ఈ సమీక్షలో స్పష్టమైన దిశానిర్దేశం చేసింది.

# కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాలు



**మొదటిపేజీ తరువాయి**

ఏమాత్రం తగ్గలేదని నిరూపించుకోవాలని చూస్తోంది. అయితే కాంగ్రెస్ ఏకపక్ష వైఖరికి నిరసనగా మిత్రపక్షాలు సొంతంగా అభ్యర్థిని రంగంలోకి దింపేందుకు వ్యూహరచన చేస్తున్నాయి. దీంతో అప్రమత్తమైన హస్తం పార్టీ బుజ్జగింపులు మొదలుపెట్టింది. తెలంగాణ రాజకీయాల్లో ఈ ఎన్నికలు చాలా కీలకంగా మారాయి. అన్ని పార్టీలు వీటిని చాలా సీరియస్‌గా తీసుకుంటున్నాయి. ముఖ్యంగా యువత ఓటర్లు ఎక్కువగా ఉండే ఈ స్థానాల్లో గెలుపు అన్ని పార్టీలకు చాలా ముఖ్యం. ఎందుకంటే ఇది భవిష్యత్తు రాజకీయాలపై ప్రభావం చూపుతుంది. ప్రతి ఒక్కరూ దీని గురించే మాట్లాడుతున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితి ఎప్పుడూ మారుతూ ఉంటుంది. ఓటర్ల నాడి పట్టుకోవడానికి అందరూ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ప్రచార వేగం పెంచాలని నాయకులు భావిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అధికారంలోకి వచ్చి మూడేళ్లవుతోంది. ఈ సమయంలో జరిగే ఎలాంటి ఎన్నికలైనా ప్రభుత్వ పనితీరుకు రెఫరెండంగానే చూడాల్సి ఉంటుంది. అందుకే వీటిని అన్ని పార్టీలూ ప్రతిష్టాత్మకంగా తీసుకుంటూ ఉంటాయి. కాంగ్రెస్ పార్టీ కూడా గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో సత్తా చాటడం ద్వారా 2028 ఎన్నికలకు గేట్ వే రెడీ చేసుకోవాలనుకుంటోంది. అందులో భాగంగానే అన్ని పార్టీలకంటే ముందే అభ్యర్థులను ఖరారు చేసేసింది. ఈ ఎన్నికలకు 77 మంది పరిశీలకులను నియమించి, ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తోంది. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పెద్దలు భావిస్తున్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు. కార్యకర్తలను ఉత్సాహపరిచేందుకు నాయకులు నిరంతరం శ్రమిస్తున్నారు. ఎక్కడైనా చిన్న సమస్య వస్తే వెంటనే పరిష్కరిస్తున్నారు. ఎన్నికల గెలుపే లక్ష్యంగా ముందుకు అడుగులు వేస్తున్నారు. ఎలాంటి పొరపాట్లకు తావు ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అధిష్టానం ఆదేశాలను అందరూ తూచా తప్పకుండా పాటిస్తున్నారు. ఇంత వరకూ బాగానే ఉంది. అయితే కాంగ్రెస్ పార్టీకి సీపీఐ తెలంగాణ జన సమితి మిత్రపక్షాలుగా ఉన్నాయి. ఈ రెండు పార్టీలను సంప్రదించకుండానే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఖరారు చేయడంపై ఆ పార్టీలు అసంతృప్తితో ఉన్నాయి. అందుకే ఖమ్మం వరంగల్, నల్గొండ, గ్రాడ్యుయేట్ నియోజకవర్గానికి ఉమ్మడిగా అభ్యర్థిని దించాలనే ఆలోచనకు వచ్చాయి. ఈ ఉమ్మడి జిల్లాల్లో కమ్యూనిస్టుల ప్రభావం ఎక్కువ. కోదండరాం నేతృత్వంలోని టీజేఎస్ పార్టీకి విద్యావంతుల నుంచి ఆదరణ లభిస్తుందని అంచనా వేస్తున్నారు. వీళ్లిద్దరికీ సీపీఎం కూడా మద్దతు తెలిపే అవకాశం కనిపిస్తోంది. స్థానిక నాయకులు అందరూ ఈ అంశంపై చర్చిస్తున్నారు. ఉమ్మడి పోరాటాలు చేయాలని వారు భావిస్తున్నారు. ప్రభుత్వ తీరును ఎండగట్టాలని నిర్ణయించుకున్నారు. తమ బలాన్ని నిరూపించుకోవాలని పట్టుదలగా ఉన్నారు. ఎక్కడా వెనక్కి తగ్గేదేలేదని స్పష్టం చేస్తున్నారు. ఈ పరిణామాలు రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. ఎవరి వ్యూహాలు ఎలా ఉంటాయో చూడాలి. ఈ పొత్తుల అంశం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారిపోయింది. ఒకవేళ సీపీఎం, సీపీఐ టీజేఎస్ ఉమ్మడిగా అభ్యర్థిని బరిలోకి దించితే కచ్చితంగా అది కాంగ్రెస్ ఓటుబ్యాంకుపై ప్రభావం చూస్తుంది. ఓ వైపు బీఆర్ఎస్ మరోవైపు బీజేపీ ఈ ఎన్నికల్లో గట్టిగా ఫైట్ చేసేందుకు సిద్ధమవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కాంగ్రెస్ ఓటు బ్యాంకును వామపక్షాలు చీల్చితే మొదటికే మోసం రావచ్చు. పైగా ఈ జిల్లాల్లో వామపక్షాలకు గట్టి పట్టుంది. అందుకే కాంగ్రెస్ పార్టీ ఆలస్యంగా మేల్కొంది. వ్యూహాత్మకంగా అడుగులు వేయకపోతే నష్టం జరుగుతుందని పెద్దలు ఆందోళన చెందుతున్నారు. ప్రతిపక్షాలు దీనిని తమకు అనుకూలంగా మార్చుకోవాలని చూస్తున్నాయి. కాంగ్రెస్ నాయకుల్లో టెన్షన్ అంతకంతకూ పెరుగుతోంది. ఎటువంటి పరిణామాలు ఎదురవుతాయోనని అందరూ భయపడుతున్నారు. ఓటర్లు ఎవరికి మద్దతు ఇస్తారోననే టెన్షన్ పార్టీల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ప్రచార సరళిని మార్చాలని తలపోస్తున్నారు. అనుభవజ్ఞులైన నాయకుల సలహాలు తీసుకుంటున్నారు. క్షేత్రస్థాయి నివేదికలను పరిశీలిస్తున్నారు. ఎలాంటి పొరపాటు జరగకుండా ఉండేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. వామపక్షాల వ్యూహాన్ని గమనించిన కాంగ్రెస్ పార్టీ వెంటనే ఆ పార్టీలతో చర్చలకు సిద్ధమైంది. సీపీఐ, సీపీఎంలతో పాటు టీజేఎస్ పార్టీలతో టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, మల్లు రవి తదితరులు చర్చలు జరపాలని నిర్ణయించారు. ఎలాగైనా వామపక్షాలను దారికి తేవాలని సీఎం రేవంత్ రెడ్డి వీళ్లకు బాధ్యత అప్పగించినట్లు సమాచారం. ఇక వామపక్షాలు టీజేఎస్ కాంగ్రెస్ బుజ్జగింపులకు తలొగ్గుతాయా లేదా అనేది త్వరలోనే తేలనుంది. అందరి చూపు ఈ భేటీల పైనే నిలిచింది. ఎటువంటి నిర్ణయం వెలువడుతుందోనని సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

# పేదలకు నగరంలోనే ఇళ్లు

**మొదటిపేజీ తరువాయి**



నగరంలోని ప్రధాన ప్రాంతంలో ఉన్నత స్థాయి అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన కీలకమైన ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్ రంగారెడ్డి మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల కలెక్టర్లతో కలిసి క్యూర్ ఇందిరమ్మ టవర్ల పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు. పేద ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఈ సందర్భంగా మంత్రి స్పష్టం చేశారు. ఏ చిన్న పొరపాట్లకు తావులేకుండా అన్ని ఏర్పాట్లను పక్కాగా పూర్తి చేయాలని అధికారులకు తేల్చిచెప్పారు. ఎక్కడా ఎలాంటి ఆలస్యం జరగకుండా అధికారులు చాలా వేగంగా అడుగులు వేయాలని గట్టిగా కోరారు. ఈ బృహత్తర ప్రాజెక్టును విజయవంతం చేసేందుకు ప్రభుత్వం పూర్తి కట్టుబడి ఉందని ఆయన మరోసారి గుర్తుచేస్తూ అధికారులకు తగు సూచనలు జారీ చేసి బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. క్యూర్ పరిధిలో మూడు దశల్లో మొత్తం లక్ష ఇందిరమ్మ ఫ్లాట్లను నిర్మించనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. ప్రస్తుతం కొనసాగుతున్న మొదటి దశతో పాటుగా రెండు, మూడు దశలకు అవసరమైన భూములను త్వరితగతిన సేకరించాలని ఆయన అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఏజెన్సీలతో సమన్వయం చేసుకుంటూ పనులను వేగవంతం చేయాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని ప్రక్రియలు సజావుగా సాగేలా చూడాలని కోరారు. ఎక్కడా ఎలాంటి జాప్యం తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ప్రతిపాదనల దశలోనే భూసేకరణను పూర్తి చేస్తే పనులు వేగంగా ముందుకు సాగుతాయని అభిప్రాయపడ్డారు. ఈ బృహత్తర గృహ నిర్మాణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అన్ని శాఖల అధికారులు పరస్పరం సహకరించుకోవాలని పిలుపునిచ్చారు. నిర్ధారిత గడువులోగా అన్ని దశల పనులు పూర్తి కావాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో ముందుకు సాగాలని అధికారులకు స్పష్టం చేస్తూ తగిన కార్యాచరణను సిద్ధం చేసుకోవాలని అన్నారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ఈ నెలాఖరు నాటికి అత్యంత పారదర్శకంగా పూర్తి చేయాలని అధికారులను మంత్రి గట్టిగా ఆదేశించారు. ఎంపిక కోసం నిర్వహించే లాటరీ ప్రక్రియను యూట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారం చేయాలని అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. ఎక్కడా ఎలాంటి అవకతవకలకు అవకాశం ఇవ్వకుండా అర్హులైన వారికే ప్రాధాన్యత దక్కేలా చూడాలని కోరారు. నగరంలోని పేదలకు వారి నివాస ప్రాంతాలకు ఉపాధి మార్గాలకు సమీపంలోనే గృహ వసతి కల్పించాలనేదే ఇందిరమ్మ టవర్ల ప్రధాన ఉద్దేశమని మంత్రి వివరించారు. పేదలను ఎట్టిపరిస్థితుల్లోనూ నగర శివార్లకు తరలించకూడదన్నదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. అర్హత కలిగిన ప్రతి నిరుపేద కుటుంబానికి లబ్ధి చేకూర్చేలా పారదర్శక విధానాన్ని అమలు చేయాలని ఆయన కోరారు. ఏ రకమైన సిఫార్సులకు తావు లేకుండా కేవలం అర్హతను మాత్రమే ప్రాతిపదికగా తీసుకుని ఎంపికలు చేపట్టాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి పారదర్శకతకు పెద్దపీట వేయాలన్నారు. ఈ పథకం కింద లబ్ధి పొందే వారికి ఫ్లాట్‌పై పూర్తి యాజమాన్య హక్కులతో పాటుగా అవిభాజ్య భూమి వాటాను ఎటువంటి రిజిస్ట్రేషన్ ఛార్జీలు లేకుండా అందజేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. పేద కుటుంబాలకు ఎలాంటి ఆర్థిక భారం పడకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ వెసులుబాటును కల్పిస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఇళ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీపడకుండా పాటించాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు అందించే ప్రతి సౌకర్యం అత్యంత ఉత్తమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నాణ్యమైన సామాగ్రిని ఉపయోగించి పనులు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ఈ టవర్ల నిర్మాణం సాగాలని ఆయన పేర్కొన్నారు. లబ్ధిదారుల చిరునవ్వులే ప్రభుత్వానికి అసలైన బహుమతి అని చెబుతూ అధికారులకు బాధ్యతలను గుర్తుచేశారు. ఎలాంటి లోటుపాట్లు లేనివిధంగా పనులను పర్యవేక్షించాలని ఇంజనీరింగ్ అధికారులను ప్రత్యేకంగా ఆదేశిస్తూ ఎప్పటికప్పుడు నివేదికలను అందించాలని తెలిపారు. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్ల నిర్మాణానికి శంకుస్థాపనలు జరిగాయని కొన్ని ప్రాంతాల్లో టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయిందని మంత్రి గుర్తుచేశారు. లబ్ధిదారుల అర్హతలను నిశితంగా పరిశీలించిన తర్వాత బహిరంగ డ్రాల ద్వారా ఎంపిక ప్రక్రియ కొనసాగుతోందని ఆయన తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే లక్షలాది ఇళ్లను మంజూరు చేసిన ఇందిరమ్మ పథకంలో భాగంగా పట్టణ ప్రాంత గృహ నిర్మాణానికి కూడా ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. భూముల గుర్తింపుతో పాటు ఇతర అనుబంధ ప్రక్రియలను వేగవంతం చేసి ప్రాజెక్టుల నిర్మాణ వేగాన్ని కొనసాగించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. పేదరిక నిర్మూలనకు ఇందిరమ్మ పథకం ఒక పెద్ద వరమని నిరూపించేలా పనులు జరగాలని ఆకాంక్షించారు. ప్రజాప్రతినిధుల సహకారంతో అన్ని ప్రాంతాల్లో పనులను విజయవంతంగా పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. ఎక్కడా ఎలాంటి అలసత్వానికి తావులేకుండా అధికారులు అంకితభావంతో పనిచేయాలని కోరారు.

# దర్భగూడెం పంచాయతీ గెలుపుకే లక్ష్యం

- **ఎంపీటీసీగా అవకాశం కల్పించండి.. ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా: పద్దం వెంకటకృష్ణ**

**విశాలభారతి, జీలుగుమిల్లి :**

ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం దర్భగూడెం ఎంపీటీసీ అభ్యర్థిగా పద్దం వెంకటకృష్ణ నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దర్భగూడెం పంచాయతీ పరిధిలోని ప్రజలు తనకు అవకాశం కల్పించి ఎంపీటీసీగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీటీసీగా ఎన్నికైతే దర్భగూడెం పంచాయతీ పరిధిలోని గ్రామాలు, కాలనీల అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యంగా రహదారుల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, తాగునీటి పైపులైన్ల ఏర్పాటు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తానని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన ఇతర అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తాను ప్రజల్లో ఒకరిగా ఉంటూ, వారి కష్టసుఖాల్లో భాగస్వామినవుతానని తెలిపారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రజలకు న్యాయం జరిగేలా నిరంతరం కృషి చేస్తానన్నారు. దర్భగూడెం పంచాయతీ సమగ్ర అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన, స్థానిక సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యాలని పద్దం వెంకటకృష్ణ పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తనకు మద్దతు ఇచ్చి ఎంపీటీసీగా గెలిపించాలని పంచాయతీ ప్రజలను కోరారు.



GENERAL news
WWW.VISHALABHARATI.COM
విశాల భారతి

# తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలి

- ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి..
- ఎల్బీనగర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దహనం



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలని, ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎల్బీనగర్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. రైతు, వ్యవసాయ కార్మిక, కార్మిక సంఘాల అఖిల భారత కమిటీల పిలుపులో భాగంగా సీఐటీయూ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య అధ్యక్షతన ఎన్నికల ప్రధాన అధికారి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు జాజాల రుద్రకుమార్, జిల్లా కోశాధికారి కవిత మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 13 కోట్ల 37 లక్షల ఓట్లు తొలగించారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో 48.90 శాతం, రంగారెడ్డి జిల్లాలో 2,223 ఓట్లు తొలగించినట్లు పేర్కొంటూ, తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన పేద ప్రజల ఓట్లను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా తొలగిస్తోందని వారు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి తొలగించిన ఓట్లను గతంలో ఉన్న విధంగా పునరుద్ధరించాలని కోరారు. ఎన్నికల ప్రధాన అధికారి కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని విమర్శిస్తూ, జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లు నెరవేరే వరకు పోరాటం కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు జాజాల రుద్ర కుమార్, జిల్లా కోశాధికారి కవిత, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెపాక వీరయ్య, జిల్లా సహాయ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య, హయత్‌నగర్ సర్కిల్ కన్వీనర్ చింతపల్లి కృష్ణయ్య, మత్స్య కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు తడబోయిన కృష్ణమూర్తి, ఎల్బీనగర్ అడ్డా అధ్యక్షుడు సీహెచ్ మున్నా, కార్యదర్శి లాట్ల లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు గంగరాజు, సహాయ కార్యదర్శి లింగయ్య, కోశాధికారి ఆంధ్ర శీను, పి. జోసెఫ్, భాస్కర్, ఈ. ఎల్లయ్య, వెంకన్న, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు. అడ్డా కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై నిరసనలో భాగస్వాములయ్యారు.

## విద్యానగర్ కాలనీలో డ్రైనేజీ సమస్యపై కళ్లెం నవజీవన్ రెడ్డి పరిశీలన

- కాలనీవాసుల ఇబ్బందులు తెలుసుకుని.. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** హయత్‌నగర్ విద్యానగర్ కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యపై హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి స్పందించారు. కాలనీవాసుల సమాచారం మేరకు ఆయన స్వయంగా కాలనీలో పర్యటించి డ్రైనేజీ సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా మురుగునీటి సమస్య కారణంగా స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో డ్రైనేజీ సమస్యకు త్వరితగతిన పరిష్కారం చూపించాలని, మురుగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడకుండా సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కళ్లెం నవజీవన్ రెడ్డి కోరారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ప్రజలకు ఎక్కడ సమస్య ఎదురైనా స్పందిస్తూ, వాటి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయడమే తన లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి ప్రజల పక్షాన నిలబడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## సన్‌సిటీ మార్షల్ ఆర్ట్స్ విద్యార్థుల ఘనత

- 39 మందికి బ్లాక్ బెల్టులు ప్రదానం



**రాజేంద్రనగర్, విశాల భారతి :** బండ్లగూడ జాగీర్ డివిజన్ పరిధిలోని పి అండ్ టి కాలనీ సి బ్లాక్‌లో ఉన్న సన్‌సిటీ మార్షల్ ఆర్ట్స్ పాఠశాల విద్యార్థులు మార్షల్ ఆర్ట్స్‌లో విశేష ప్రతిభ కనబరిచి గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు, బ్లాక్ బెల్టులు సాధించడం అభినందనీయమని 121వ డివిజన్ బండ్లగూడ జాగీర్ సీనియర్ నాయకుడు నదీమ్ అన్నారు. ఈ సందర్భంగా బాలురు, బాలికలు కలిపి మొత్తం 39 మంది విద్యార్థులు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు, బ్లాక్ బెల్టులు అందుకోవడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధనతో ఈ విజయాన్ని సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు. మార్షల్ ఆర్ట్స్ శిక్షణ ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, ధైర్యం, శారీరక దృఢత్వం పెంపొందుతాయని తెలిపారు. విద్యార్థులు ఇదే స్ఫూర్తితో మరింత ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని నదీమ్ ఆకాంక్షించారు. విద్యార్థుల విజయానికి కృషి చేసిన మార్షల్ ఆర్ట్స్ శిక్షకుడు అబ్దుల్ రహీమ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులకు సమర్థవంతంగా శిక్షణ అందించి, వారిని ఈ స్థాయికి తీసుకురావడంలో ఆయన చేసిన కృషి ప్రశంసనీయమని అన్నారు. విద్యార్థుల విజయాలు తల్లిదండ్రులకు, పాఠశాలకు గర్వకారణమని పేర్కొంటూ, భవిష్యత్తులో కూడా విద్యార్థులు మరిన్ని పతకాలు, పురస్కారాలు సాధించి తమ ప్రతిభను చాటుకోవాలని నదీమ్ ఆకాంక్షించారు

## జవహర్ నగర్ డంపింగ్ యార్డు తరలింపునకు ఉద్యమ కార్యాచరణ

- ఈటల రాజేందర్ నేతృత్వంలో సన్నాహక సమావేశం
- పాల్గొన్న హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** జవహర్ నగర్ డంపింగ్ యార్డు తరలింపు కోసం చేపట్టనున్న ఉద్యమ కార్యాచరణ, పాదయాత్ర సన్నాహక సమావేశంలో హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పాల్గొన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ నేతృత్వంలో నిర్వహించిన ఈ సమావేశంలో డంపింగ్ యార్డు తరలింపునకు చేపట్టాల్సిన భవిష్యత్ కార్యాచరణపై నాయకులు చర్చించారు. జవహర్ నగర్ డంపింగ్ యార్డు కారణంగా పరిసర ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, పర్యావరణ కాలుష్యం, ప్రజారోగ్యంపై పడుతున్న ప్రభావాలను సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ప్రజలకు కాలుష్య సమస్యల నుంచి ఉపశమనం కల్పించడంతోపాటు, డంపింగ్ యార్డు తరలింపు కోసం ప్రజలను సమీకరించి ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరాన్ని నాయకులు ప్రస్తావించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ, పర్యావరణ సంరక్షణ, స్థానిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా చేపట్టనున్న పాదయాత్రను విజయవంతం చేసేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై సమావేశంలో చర్చించారు. ఈ కార్యక్రమంలో కళ్లెం నవజీవన్ రెడ్డి పాల్గొని డంపింగ్ యార్డు తరలింపు ఉద్యమానికి సంబంధించిన కార్యాచరణపై జరిగిన చర్చల్లో భాగస్వాములయ్యారు.

## మెదక్ జిల్లాలో ఆయుష్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

- అక్టోబర్ 31 వరకు గడువు: కలెక్టర్ ప్రతిమా సింగ్



**చట్టం రామాయంపేట :** మెదక్ జిల్లాలో జాతీయ ఆయుష్ మిషన్ ఆధ్వర్యంలో వివిధ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయుష్ మెడికల్ ఆఫీసర్ పోస్టులు 3, ఫార్మసిస్ట్ 1, సైకో సోషల్ కౌన్సిలర్ 1, యోగ ప్రొఫెషనల్ 1, మల్టీపర్పస్ వర్కర్ పోస్టులు 2 భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. 18 నుంచి 44 సంవత్సరాల వయసు గల అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు అక్టోబర్ 26 నుంచి 31 వరకు కలెక్టర్ కార్యాలయంలోని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌వో) కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. విద్యార్హతలు, వేతనాలు, ఇతర వివరాల కోసం మెదక్ జిల్లా అధికారిక వెబ్‌సైట్ medak.telangana.gov.in ను సందర్శించాలని సూచించారు.

## స్థానిక పరిశ్రమల్లో స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలి




- రెండు లక్షల ఉద్యోగాల హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి డిమాండ్

**చౌటుప్పల్, విశాలభారతి:** మండలంలో ఉన్న స్థానిక పరిశ్రమల్లో స్థానిక నిరుద్యోగ యువతీ యువకులకు ప్రాధాన్యతనిస్తూ ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. కందాల రంగారెడ్డి స్మారక భవనంలో సీపీఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు చీరిక సంజీవరెడ్డి అధ్యక్షతన జరిగిన మండల కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చౌటుప్పల్ మండలంలో అనేక పరిశ్రమలు ఉన్నప్పటికీ స్థానిక నిరుద్యోగ యువతకు తగిన స్థాయిలో ఉద్యోగ అవకాశాలు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమలు అభివృద్ధి చెందుతున్నప్పుడు ఆ ప్రాంత ప్రజలకు ఉపాధి కల్పించడం ద్వారానే వారి ఆర్థిక పరిస్థితులు మెరుగుపడతాయని అన్నారు. ఎన్నికల సమయంలో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాల హామీని వెంటనే నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, స్థానిక పరిశ్రమల యాజమాన్యాలతో చర్చించి స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానిక యువతకు న్యాయం జరిగే వరకు సీపీఎం నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి గంగాదేవి సైదులు, జిల్లా కమిటీ సభ్యులు రాగిరి కిష్టయ్య, మండల కార్యదర్శివర్గ సభ్యులు చింతల సుదర్శన్, మండల కమిటీ సభ్యులు అంతటి అశోక్, ఆదిమూలం నందీశ్వర్, పొట్ట శ్రీనివాస్, ఎల్లమల్ల సంజీవ, మీసాల శీను తదితరులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఉద్యోగులకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

- 1930 టోల్ ఫ్రీ నంబర్ కు ఫోన్ చేయండి
- జి.మన్మథకుమార్ సీఐ




**చౌటుప్పల్, విశాలభారతి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం చౌటుప్పల్ శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చౌటుప్పల్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ జి.మన్మథ కుమార్ హాజరై సైబర్ నేరాల పట్ల రిటైర్డ్ ఉద్యోగులకు, సీనియర్ సిటిజన్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం ఫిషింగ్, ఆన్ లైన్ మోసాలు, సోషల్ మీడియా మోసాలు, డిజిటల్ అరెస్ట్, లోన్ యాప్ మోసాలు, గుర్తింపు మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. తెలియని నంబర్ల నుండి ఫోన్లు, వీడియో కాల్స్, ఆన్ లైన్ లింకులు వస్తే వాటిని ఓపెన్ చేయవద్దని సూచించారు. ఒకవేళ ఎవరైనా మోసానికి గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్ కు ఫోన్ చేయాలని తెలిపారు. సైబర్ నేరాల విభాగం పరిశీలిస్తున్న కేసులను ఉదాహరణలతో వివరించి అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు భీమిడి మోహన్ రెడ్డి అధ్యక్షత వహించగా, ప్రధాన కార్యదర్శి కానుగుల వెంకటయ్య స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంఘ సభ్యులు బాతరాజు ఆగయ్య, కోశాధికారి బడుగు శ్రీరాములు, నారగోని కృష్ణయ్య గౌడ్, బిక్కు నాయక్, చొల్లేటి రాజయ్య, సీనియర్ సిటిజన్ ప్రధాన కార్యదర్శి గోశిక లక్ష్మయ్య, బొల్లారం లక్ష్మీనారాయణ, బొమ్మిడి సత్తిరెడ్డి, సిలివేరు కృష్ణ, కోణం వినోద, గోశిక మురళి తదితరులు, అదేవిధంగా ప్రాంత సీనియర్ సిటిజన్స్, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రూ.18.5 కోట్ల భవనం నిరుపయోగమా?



- నార్సింగి కార్యాలయాన్ని మణికొండకు తరలించాలి

**రాజేంద్రనగర్, విశాలభారతి :** ప్రజాధనంతో రూ.18.5 కోట్ల వ్యయంతో నిర్మించిన నూతన మున్సిపల్ కార్యాలయ భవనాన్ని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని, నార్సింగి మున్సిపల్ సర్కిల్-45 కార్యాలయాన్ని వెంటనే మణికొండకు తరలించాలని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) స్థానిక నాయకులు డిమాండ్ చేశారు. అన్ని సౌకర్యాలతో నిర్మించిన భవనం అందుబాటులో ఉన్నప్పటికీ దానిని ఖాళీగా ఉంచి, మౌలిక సదుపాయాల కొరత ఉన్న నార్సింగి కార్యాలయంలో కార్యకలాపాలు కొనసాగించడం పట్ల వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. మణికొండలో రూ.18.5 కోట్ల ప్రజాధనంతో నిర్మించిన నూతన మున్సిపల్ కార్యాలయ భవనాన్ని 2025 నవంబర్‌లో రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మణికొండ మున్సిపల్ కమిషనర్ కార్యాలయంగా ప్రారంభించారు. అనంతరం మణికొండ మున్సిపాలిటీ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం కావడంతో, ఈ భవనాన్ని నార్సింగి మున్సిపల్ సర్కిల్-45 డిప్యూటీ కమిషనర్ కార్యాలయంగా కొంతకాలం వినియోగించారు. అయితే గత పది నెలలుగా ఈ భవనాన్ని పూర్తిస్థాయిలో వినియోగించకపోవడం పలు ప్రశ్నలకు తావిస్తోందని నాయకులు పేర్కొన్నారు. ప్రస్తుతం నార్సింగిలోని కార్యాలయంలో సరిపడా స్థలం లేకపోవడంతోపాటు వాహనాల పార్కింగ్‌కు తగిన సదుపాయాలు, అవసరమైన సంఖ్యలో మరుగుదొడ్లు అందుబాటులో లేవని వారు తెలిపారు. దీంతో కార్యాలయానికి వచ్చే ప్రజలు, సిబ్బంది అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు, మణికొండలో అన్ని సదుపాయాలతో నిర్మించిన భవనాన్ని గత రెండు నెలలుగా నిరుపయోగంగా ఉంచడం వల్ల ప్రజాధనం వృథా అవుతోందని విమర్శించారు. రూ.18.5 కోట్లతో నిర్మించిన భవనాన్ని వినియోగించకపోవడానికి కారణమేమిటని బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నించారు. ఒకవైపు కార్యాలయంలో మౌలిక సదుపాయాల కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, మరోవైపు అన్ని సౌకర్యాలున్న నూతన భవనాన్ని ఖాళీగా ఉంచడంలో ఆంతర్యమేమిటని నిలదీశారు. సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే స్పందించి మణికొండలోని నూతన కార్యాలయ భవనాన్ని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని, నార్సింగి మున్సిపల్ సర్కిల్-45 కార్యాలయాన్ని తక్షణమే మణికొండకు తరలించాలని వారు డిమాండ్ చేశారు. ప్రజాధనం వృథా కాకుండా చూడటంతోపాటు ప్రజలకు మెరుగైన మున్సిపల్ సేవలు అందించేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## కోమటిరెడ్డి లక్ష్మికి దసరా శుభాకాంక్షలు దేవాలయ కమిటీ



**చౌటుప్పల్,విశాల భారతి:** మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సతీమణి శ్రీమతి కోమటిరెడ్డి లక్ష్మిని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. దసరా పండుగ సందర్భంగా వారి స్వగృహంలో కలిసి దేవాలయ కమిటీ తరపున దసరా శుభాకాంక్షలు తెలియజేశారు .ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు, దసరా ఉత్సవాల విశేషాలను వారితో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ బొబ్బిళ్ళ మురళి గురుస్వామి సంధ్యా,వర్కాల రవి గౌడ్ వెన్నెల,ఆవుల యేసు యాదవ్ పుణ్యవతి,బొబ్బిళ్ళ సామ్రాట్ తదితరులు పాల్గొన్నారు.

## రామ్ లీలా కార్యక్రమం విజయవంతంతో కమిటీకి తేనేటి విందు

- ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపిన సాయినాథ్ రెడ్డి



**కూకట్ పల్లి, విశాలభారతి:** కెపిహెచ్బి రమ్య గ్రౌండ్ లో దసరా రోజు జరిగిన రామ్ లీలా కార్యక్రమం విజయవంతంగా అయినందు సందర్భంగా తేనేటి విందు కార్యక్రమంలో పాల్గొన్న కమిటీ సభ్యులు ప్రతి ఒక్కరూ ఎంతో శ్రద్ధగా ఈ కార్యక్రమాన్నికి కష్టపడి విజయవంతం చేసినందుకు ప్రతి ఒక్కరిని ధన్యవాదాలు అని తెలియజేశారు పటోళ్ల సాయినాథ్ రెడ్డి, ఈ కార్యక్రమంలో బండి మధుసూదన్ రెడ్డి, షేరీ సతీష్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి,ఉపేందర్ రెడ్డి, జిఎల్ఎన్ రెడ్డి, తులసి రెడ్డి, గాలి రెడ్డి, ఆదిరెడ్డి, కోటేశ్వరరావు, ఎస్ ఎల్ ఎన్ రెడ్డి, రమణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు స్వాములు నియామకం

- 41వ జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌కు రెఫరీ, అంపైర్‌గా ఎంపిక



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శారీరక విద్య ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న డా. సోలపోగుల స్వాములు జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు సాంకేతిక అధికారిగా నియమితులయ్యారు. తమిళనాడు రాష్ట్రం చెన్నైలో అక్టోబర్ 23 నుంచి 27 వరకు నిర్వహించనున్న 41వ జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో ఆయన రెఫరీ, అంపైర్‌గా విధులు నిర్వహించనున్నారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. వెంకటేశ్వర్లు అక్టోబర్ 14న అధికారిక ఉత్తర్వులు జారీ చేసినట్లు బాటసింగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దాసరి ప్రతాప్ తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు సాంకేతిక అధికారిగా ఎంపిక కావడం రంగారెడ్డి జిల్లాతో పాటు బాటసింగారం పాఠశాలకు గర్వకారణమని పేర్కొన్నారు. డా. సోలపోగుల స్వాములు క్రీడారంగంలో విశేష అనుభవం కలిగి ఉండటంతో పాటు అథ్లెటిక్స్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారు. క్రీడాకారులకు శిక్షణ అందిస్తూ, వివిధ స్థాయిల్లో క్రీడల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తున్నారు. జాతీయ స్థాయి పోటీలకు సాంకేతిక అధికారిగా ఎంపిక కావడం ఆయన అనుభవానికి, క్రీడా నైపుణ్యానికి గుర్తింపుగా నిలుస్తోంది. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, గ్రామస్థులు, క్రీడా అధికారులు, శారీరక విద్య ఉపాధ్యాయులు, సహచరులు హర్షం వ్యక్తం చేస్తూ డా. సోలపోగుల స్వాములకు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థాయి క్రీడా బాధ్యతలు చేపట్టి రాష్ట్రానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## బండరావిరాలలో బెల్ట్ షాపుల మూసివేతకు తీర్మానం

- సీఐ చి. రాజుకు సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్ ఫిర్యాదు



**విశాలభారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** బండరావిరాల గ్రామంలో బెల్ట్ షాపుల ద్వారా జరుగుతున్న అక్రమ మద్యం విక్రయాలను అరికట్టాలని గ్రామ పంచాయతీ పాలకవర్గం నిర్ణయించింది. గ్రామంలో తెల్లవారుజామున 5 గంటల నుంచే మద్యం విక్రయిస్తున్నారని, దీనివల్ల అనేక కుటుంబాలు ఆరోగ్యపరంగా, ఆర్థికంగా నష్టపోతున్నాయని గ్రామసభలో మహిళలు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై చర్చించిన గ్రామసభ బెల్ట్ షాపులను మూసివేయాలని తీర్మానం చేసింది. గ్రామసభ తీర్మానం మేరకు సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్, పాలకవర్గ సభ్యులు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ సీఐ చి. రాజును కలిసి ఫిర్యాదు చేశారు. గ్రామసభ తీర్మాన ప్రతులు, నోటీసులను ఆయనకు అందజేసి, గ్రామంలో అక్రమ మద్యం విక్రయాలను అరికట్టి బెల్ట్ షాపుల మూసివేతకు చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామంలో శాంతిభద్రతలను పరిరక్షించడంతో పాటు ప్రజలు ఆరోగ్యపరంగా, ఆర్థికంగా నష్టపోకుండా చూడటం, యువతను మద్యపాన దుష్ప్రభావాల నుంచి కాపాడటమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ దూస శంకర్, వార్డు సభ్యులు ఏర్పుల హరికృష్ణ, గుండ్ల భవాని శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభకు పట్టం

- జూనియర్ సివిల్ జడ్జిగా అగిరు లక్ష్మీ ప్రసాద్
- జడ్జిగా ఎంపికైన లక్ష్మీ ప్రసాద్‌కు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ఘన సత్కారం



**విశాల భారతి, షాద్‌నగర్:** న్యాయవాదిగా ప్రస్థానం సాగిస్తూ, కష్టపడి చదివి జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన అగిరు లక్ష్మీ ప్రసాద్‌ను ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్ రెడ్డి అభినందించారు.ఈ సందర్భంగా షాద్‌నగర్ పట్టణంలోని లక్ష్మీ ప్రసాద్ నివాసానికి వెళ్లిన ఎమ్మెల్సీ.. ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ.. జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక కావడం లక్ష్మీ ప్రసాద్ ప్రతిభకు, పట్టుదలకు, నిరంతర కృషికి దక్కిన గౌరవమని కొనియాడారు. న్యాయవ్యవస్థలో కీలకమైన బాధ్యతలు చేపట్టబోతున్న ఆయన.. భవిష్యత్తులో ప్రజలకు నిష్పక్షపాతంగా న్యాయం అందిస్తూ, న్యాయవృత్తిలో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బీరంగూర జగన్మోహన్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు కానుగు అనంతయ్య, నందకిషోర్, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మలిపెద్ది శ్రీనివాస్ గుప్తా, మాజీ సర్పంచ్ అజయ్ నాయక్, నాయకులు దండు రాము, హర్షవర్ధన్ రెడ్డి, అన్వారీ రాజు, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు పంటకు కరెంటు కరువు.. కాంగ్రెస్ హామీలకు కాలం చెల్లిందా ?

- మూడు సార్లు మోటారు దగ్ధం
- రెండెకరాల వరి పంటను కాపాడుకునేందుకు ట్యాంకర్లతో నీళ్లు!
- లో వోల్టేజీతో రైతుకు నష్టం..
- విద్యుత్ సరఫరాపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదా?
- కందికొండ రైతు దారావత్ వెంకన్న ఆవేదన

**కురవి విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ దేవన్న:**

రైతే దేశానికి వెన్నెముక.. రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పే కాంగ్రెస్ పాలకులకు క్షేత్రస్థాయిలో రైతులు పడుతున్న కష్టాలు కనిపించడం లేదా? ఎన్నికల ముందు హామీల వర్షం కురిపించి, అధికారంలోకి వచ్చాక రైతు సమస్యలపై మౌనం వహించడం ఏ రకమైన పాలన? వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందించలేని పరిస్థితి ఉంటే రైతులు పంటలు ఎలా పండించాలి? మోటార్లు కాలిపోతుంటే, పంటలు ఎండిపోతుంటే బాధ్యత ఎవరిది? అంటూ మహబూబాబాద్ జిల్లా కురవి మండలం కందికొండకు చెందిన రైతు దారావత్ వెంకన్న ఆవేదన ప్రభుత్వానికి ప్రశ్నగా మారుతోంది. రెండెకరాల వరి పంటను కాపాడుకునేందుకు రైతు పడుతున్న కష్టాలు హృదయవిదారకంగా ఉన్నాయి. లో వోల్టేజీ కారణంగా తన వ్యవసాయ మోటారు మూడుసార్లు కాలిపోయిందని వెంకన్న చెబుతున్నారు. మోటార్ల మరమ్మతులు, పంటకు నీరు అందించేందుకు పడుతున్న ఇబ్బందులతో తీవ్రంగా నష్టపోతున్నానని వాపోతున్నారు. పంటకు నీరు అందక ఎండిపోయే పరిస్థితి రావడంతో చివరకు ట్యాంకర్ల ద్వారా నీటిని తెచ్చి పొలానికి పోస్తున్నారు. బోరు మోటారుకు విద్యుత్ సరిగా అందించలేని పరిస్థితిలో రైతు ట్యాంకర్లతో నీళ్లు పోసుకోవాల్సి వస్తే.. వ్యవసాయ విద్యుత్‌పై ప్రభుత్వం చెబుతున్న భరోసా ఏమైందని ప్రశ్నిస్తున్నారు.





**మోటార్లు మూడుసార్లు కాలిపోయినా పరిష్కారం ఏదీ?**

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండాలి. వోల్టేజీ హెచ్చుతగ్గులు లేకుండా చూడాలి. రైతుల మోటార్లు దెబ్బతినకుండా విద్యుత్ వ్యవస్థను పర్యవేక్షించాలి. ఇవి సంబంధిత శాఖల కనీస బాధ్యతలు. కానీ కందికొండ రైతు వెంకన్న అనుభవిస్తున్న పరిస్థితి మాత్రం ఆ బాధ్యతల అమలుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఒకసారి కాదు.. రెండుసార్లు కాదు.. ఏకంగా మూడుసార్లు మోటారు కాలిపోయిందని రైతు చెబుతున్నా, తనకు ఎదురైన సమస్య నుంచి బయటపడేందుకు ఆయన ట్యాంకర్లను ఆశ్రయించాల్సి వస్తోంది. మోటారు కాలిపోతే మరమ్మతుల ఖర్చు రైతుదే.. పంటకు నీరు అందకపోతే నష్టం రైతుదే.. పంట ఎండిపోతే పెట్టుబడి నష్టమూ రైతుదే! మరి రైతుకు భరోసా ఇవ్వాల్సిన ప్రభుత్వ బాధ్యత ఏమిటి? విద్యుత్ సరఫరాలో లోపాల కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారనే ఫిర్యాదులు వస్తే అధికారులు వెంటనే స్పందించాల్సిన అవసరం లేదా? ఈ ప్రశ్నలకు ప్రభుత్వం, సంబంధిత విద్యుత్ శాఖ సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

**కాంగ్రెస్ హామీలు కాగితాలకే పరిమితమా?**

రైతుల సంక్షేమం గురించి గొప్పగా చెప్పే కాంగ్రెస్ ప్రభుత్వం.. క్షేత్రస్థాయిలో వ్యవసాయ విద్యుత్ సమస్యలను పరిష్కరించడంపై దృష్టి పెట్టాలని వెంకన్న కోరుతున్నారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం చిత్తశుద్ధి చూపాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, లో వోల్టేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తున్నారు. రైతు పంట పండించేందుకు అప్పులు చేసి పెట్టుబడులు పెడతాడు. విత్తనం వేసినప్పటి నుంచి పంట చేతికొచ్చే వరకు ప్రతి అడుగులోనూ ఆందోళనతోనే సాగు చేస్తాడు. ఇలాంటి పరిస్థితుల్లో విద్యుత్ సమస్యలు అదనపు భారంగా మారితే రైతు పరిస్థితి ఏమిటి? పంటను కాపాడుకునేందుకు ట్యాంకర్లతో నీళ్లు పోయాల్సి వస్తే సాగు ఖర్చులు ఎక్కడికి చేరాలి? రైతుకు నష్టం కలిగినప్పుడు ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందా? లేక హామీలతోనే సరిపెడుతుందా?

**కేసీఆర్ పాలనలో పచ్చదనం.. ఇప్పుడు రైతుకు కన్నీటి కష్టాలా?**

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ పాలనలో సాగునీరు, విద్యుత్ సౌకర్యాలు మెరుగ్గా ఉండటంతో ద్యుత్ విషయంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తోందని ప్రశ్నించారు. ప్రభుత్వాలు మారినా రైతుల కష్టాలు మాత్రం కొనసాగితే మార్పు వచ్చిన ప్రయోజనం ఏమిటి? రైతు సంక్షేమం గురించి ప్రకటనలు చేయడం ఒక ఎత్తయితే, పొలంలో రైతుకు ఎదురవుతున్న సమస్యను పరిష్కరించడం మరో ఎత్తు. కందికొండలో దారావత్ వెంకన్న పరిస్థితి ఈ రెండింటి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ఎత్తిచూపుతోంది.

**రైతుకు భరోసా ఎక్కడ? ప్రభుత్వానికి ప్రశ్నలు!**

రెండెకరాల వరి పంటను కాపాడుకోవడానికి ట్యాంకర్లతో నీళ్లు పోస్తున్న రైతు పరిస్థితిపై విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే స్పందించాలి. అధిక వోల్టేజీ సమస్యకు కారణాలను పరిశీలించి, విద్యుత్ సరఫరాను సరిచేయాలి. మోటార్లు పదేపదే కాలిపోకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలి. పంటకు నీరు అందేలా రైతుకు సహకరించాలి. రైతు కష్టాన్ని పట్టించుకోని పాలన ఎందుకు? హామీలు ఇచ్చిన ప్రభుత్వం సమస్యకు పరిష్కారం చూపించాల్సిన బాధ్యత నుంచి తప్పించుకోగలదా? మూడుసార్లు మోటారు కాలిపోయిన రైతుకు న్యాయం చేసేది ఎవరు? పంట ఎండిపోతుంటే ప్రభుత్వం స్పందించేది ఎప్పుడు? కందికొండ రైతు దారావత్ వెంకన్న ఎదుర్కొంటున్న పరిస్థితి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఒక హెచ్చరిక. రైతులకు భరోసా మాటల్లో కాదు.. పొలాల్లో కనిపించాలి. ప్రకటనల్లో కాదు.. విద్యుత్ సరఫరాలో నిరూపించాలి. హామీల్లో కాదు.. రైతు పంటను కాపాడటంలో చిత్తశుద్ధి చూపాలి. లేదంటే రైతు సంక్షేమంపై ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలన్నీ క్షేత్ర స్థాయిలో ప్రశ్నార్థకంగానే మిగిలిపోతాయి.

## చందానగర్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి

- శ్రీదేవి థియేటర్ సమీపంలో మృతదేహం.. కేసు నమోదు



**సైబరాబాద్ విశాల భారతి:** చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శ్రీదేవి థియేటర్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన శుక్రవారం వెలుగుచూసింది. హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్ బ్యాంకు ఏటీఎంల మధ్య ఓ వ్యక్తి పడి ఉన్నట్లు 112 కు సమాచారం అందడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు.పోలీసుల వివరాల ప్రకారం.. హెడ్‌కానిస్టేబుల్ కె. రాజేందర్, డ్రైవర్ కానిస్టేబుల్ హరికృష్ణ పెట్రోల్ మొబైల్ 1లో గస్తీ నిర్వహిస్తుండగా మధ్యాహ్నం 2.50 గంటల సమయంలో సమాచారం అందింది. వెంటనే అక్కడికి చేరుకుని పరిశీలించగా సుమారు 65 నుంచి 70 ఏళ్ల వయసున్న వ్యక్తి మృతిచెంది ఉన్నట్లు గుర్తించారు. మృతుడు క్రీమ్ రంగు చొక్కా ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. స్థానికులను విచారించగా.. మృతుడు గత మూడు నెలలుగా అదే ప్రాంతంలో భిక్షాటన చేస్తూ జీవిస్తున్నట్లు తెలిసింది. సరైన ఆహారం లేకపోవడంతో పాటు ఎండ, వానలకు గురై అనారోగ్యానికి లోనై మృతిచెంది ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు.ఈ ఘటనపై చందానగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతుడి ఆచూకీ, కుటుంబ సభ్యుల వివరాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

## వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తిపై అధ్యయనం

- జవహర్‌నగర్, దుండిగల్ కేంద్రాలను సందర్శించిన అధికారులు




**సైబరాబాద్ విశాల భారతి:** ఘన వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ, వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి విధానాలపై అవగాహన కోసం సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు జవహర్‌నగర్, దుండిగల్‌లోని వ్యర్థాల ప్రాసెసింగ్, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను సందర్శించారు. డిప్యూటీ కమిషనర్లు, ఇంజినీరింగ్ సిబ్బంది ఈ అధ్యయన పర్యటనలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా వ్యర్థాల సేకరణ, రవాణా, బదిలీ కేంద్రాల నిర్వహణ, శాస్త్రీయ ప్రాసెసింగ్, విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియలను అధికారులు పరిశీలించారు. వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే కేంద్రాల్లో కాలుష్య నియంత్రణ వ్యవస్థలు, బూడిద నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ చర్యలపై అవగాహన పొందారు.శాస్త్రీయ ఘన వ్యర్థాల నిర్వహణను మరింత బలోపేతం చేసి, వ్యర్థాలను ఉపయోగకరమైన వనరులుగా మార్చడంతోపాటు పరిశుభ్రమైన, సుస్థిర నగర నిర్మాణానికి చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

## మైనర్‌పై లైంగిక దాడి.. సవతి తండ్రికి జీవిత ఖైదు

- బాధితురాలికి రూ.5 లక్షల పరిహారం.. జీడిమెట్ల కేసులో కోర్టు తీర్పు



**సైబరాబాద్ విశాల భారతి:** మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి కోర్టు జీవిత ఖైదు విధించింది. జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో 2015లో నమోదైన కేసులో నందనగర్, గాంధీనగర్, చింతల్‌కు చెందిన సయ్యద్ గౌస్ (65)ను దోషిగా నిర్ధారిస్తూ మెద్చల్‌లోని అత్యాచారం, పోక్సో కేసుల ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టు న్యాయమూర్తి కె. వెంకటేశ్ తీర్పు వెలువరించారు. కేసు వివరాల ప్రకారం.. 2015 మే 15న 15 ఏళ్ల బాలికపై ఆమె సవతి తండ్రి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. బాలిక గర్భం దాల్చిన విషయం గుర్తించిన అనంతరం నిందితుడు ఆమెను నీలోఫర్ ఆసుపత్రికి తీసుకెళ్లాడు. అప్పటికే గర్భం ఐదు నెలలు కావడంతో వైద్యులు అబార్షన్‌కు నిరాకరించారు. విషయం బయటకు రాకుండా బాలికను వివిధ చైల్డ్ వెల్ఫేర్ రెస్క్యూ హోమ్స్‌లో ఉంచినట్లు దర్యాప్తులో తేలింది.తరువాత రెస్క్యూ హోమ్ సిబ్బంది బాలికను నీలోఫర్ ఆసుపత్రికి తరలించగా, అక్కడ ఆమె తనపై జరిగిన విషయాన్ని బంధువులకు వెల్లడించింది. దర్యాప్తులో నిర్వహించిన ఎఫ్ఎస్ఎల్ డీఎన్ఏ పరీక్షలో నిందితుడే శిశువుకు జీవసంబంధిత తండ్రి అని నిర్ధారణ అయింది.ఈ కేసులో నిందితుడిని పోలీసులు 2015 మే 18న అరెస్టు చేసి, దర్యాప్తు అనంతరం చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో కోర్టు ఐపీసీ 376(2)(f), 376(2)(i) సెక్షన్ల కింద రెండుసార్లు జీవిత ఖైదు, ఒక్కో కేసులో రూ.2 వేల జరిమానా విధించింది. 506 ఐపీసీ కింద ఏడాది కఠిన కారాగార శిక్ష, పోక్సో చట్టంలోని సెక్షన్ 3 రెడ్‌విత్ 4 కింద ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష, సెక్షన్ 5(j)(ii) రెడ్‌విత్ 6 కింద జీవిత ఖైదు, రూ.2 వేల జరిమానా విధించింది. బాధితురాలికి రూ.5 లక్షల పరిహారం అందించాలని కోర్టు ఆదేశించింది. కేసులో జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎ. చంద్రశేఖర్ దర్యాప్తు చేయగా, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి. ప్రభాకర్‌రెడ్డి న్యాయస్థానంలో వాదనలు వినిపించారు. వీరి కృషితో నిందితుడికి శిక్ష ఖరారైనట్లు సైబరాబాద్ డీసీపీ క్రైమ్స్ తెలిపారు.

## భార్య హత్య కేసులో భర్తకు జీవిత ఖైదు

- రూ.20 వేల జరిమానా విధించిన కోర్టు

**సైబరాబాద్ - విశాల భారతి**



భార్యను హత్య చేసిన కేసులో నిందితుడు మహమ్మద్ గౌస్ పాషా (44)కు జీవిత ఖైదు, రూ.20 వేల జరిమానా విధిస్తూ రాజేంద్రనగర్‌లోని 10వ అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు తీర్పు వెలువరించింది.2018 ఏప్రిల్ 25న గండిపేటలో షాహీన్ బేగం రక్తపు మడుగులో మృతిచెంది ఉండటంతో ఆమె సోదరుడు మహ్మద్ లతీఫ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కుటుంబ కలహాలతో పాటు భార్యపై అనుమానంతో నిందితుడు తరచూ గొడవపడేవాడు. ఏప్రిల్ 24 రాత్రి మరోసారి గొడవ జరిగిన అనంతరం ఆమె నిద్రిస్తున్న సమయంలో టవల్‌తో నోరు మూసి కత్తితో గొంతు కోసి హత్య చేశాడు. హత్య అనంతరం నిందితుడు స్కూటర్‌పై పరారై, హత్యకు ఉపయోగించిన కత్తి, రక్తపు మరకలున్న దుస్తులను వేర్వేరు ప్రాంతాల్లో దాచాడు. దర్యాప్తులో పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం, ఎఫ్ఎస్ఎల్ నివేదికలు కేసులో కీలక ఆధారాలుగా నిలిచాయి. దర్యాప్తు పూర్తి చేసిన నార్సింగి పోలీసులు ఛార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు విచారణలో నార్సింగి ఇన్‌స్పెక్టర్ జి.వి. రమణగౌడ్, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి. కృష్ణమూర్తి సమర్థవంతంగా వాదనలు వినిపించడంతో నిందితుడికి జీవిత ఖైదు పడింది.

## టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి

- వట్టినాగులపల్లి సర్వీస్ రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం



**సైబరాబాద్ విశాల భారతి:** వట్టినాగులపల్లి సర్వీస్ రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం వట్టినాగులపల్లికి చెందిన వామన్ (40) హౌస్‌కీపింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఆయన బావమరిది రవి రాథోడ్ (28) రోజువారీ కూలీగా పనిచేస్తూ గత నెల రోజులుగా వట్టినాగులపల్లిలో నివాసముంటున్నాడు.రవి రాథోడ్ శుక్రవారం తన స్వస్థలమైన కర్ణాటకకు వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. ఉదయం సుమారు 7.30 గంటల సమయంలో తన మోటార్‌సైకిల్‌పై కోకాపేట నుంచి వట్టినాగులపల్లి వైపు వెళ్తుండగా.. జీఏఆర్ భవనం సమీపంలోని సర్వీస్ రోడ్డుపై ప్రమాదం జరిగింది. అదే మార్గంలో వెళ్తున్న టిప్పర్ వాహనం డ్రైవర్ అజాగ్రత్తగా, అతివేగంగా నడుపుతూ రవి ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రవి రాథోడ్ సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు అక్కడికి చేరుకున్నారు. ఈ ఘటనపై మృతుడి బావమరిది వామన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

## సీసీటీఎన్ఎస్ అప్‌డేట్లపై నిత్యం పర్యవేక్షణ

- నూతన క్రిమినల్ చట్టాల అమలుపై సీపీ డా. ఎం. రమేశ్ సమీక్ష






**సైబరాబాద్,విశాల భారతి:** సీసీటీఎన్ఎస్ అప్‌డేట్లు, నూతన క్రిమినల్ చట్టాల అమలుపై సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేశ్ శుక్రవారం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. అన్ని జోన్ల డీసీపీలు, అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఎస్‌హెచ్‌ఓలు, ఇతర విభాగాల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఈసాక్ష్య వినియోగం, 60, 90 రోజుల చట్టబద్ధ గడువుల్లో దర్యాప్తు పూర్తి చేయడం, సీసీటీఎన్ఎస్‌లో కేసుల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయడం, ఎఫ్ఐఆర్‌లు, జీరో ఎఫ్ఐఆర్‌ల ప్రక్రియను సకాలంలో పూర్తి చేయడంపై సీపీ అధికారులకు దిశానిర్దేశం చేశారు. నూతన క్రిమినల్ చట్టాల నిబంధనలను కచ్చితంగా అమలు చేయడంతో పాటు దర్యాప్తులో నాణ్యత, నిష్పక్షపాత ధోరణి, సమగ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. నిర్ణీత గడువుల్లో దర్యాప్తు పూర్తి చేసి తదుపరి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అన్ని పోలీస్‌స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు, ఏసీపీలు దర్యాప్తుల పురోగతి, సీసీటీఎన్ఎస్ అప్‌డేట్లు, ఈసాక్ష్య అమలు, 60, 90 రోజుల గడువుల పాటింపును ప్రతిరోజూ పర్యవేక్షించాలని సీపీ స్పష్టం చేశారు. పెండింగ్ లోపాలను వెంటనే సరిదిద్దడంతో పాటు జాప్యానికి కారణాలను గుర్తించి పరిష్కరించాలని, పురోగతిపై రోజువారీ నివేదికలు సమర్పించాలని ఆదేశించారు.

## పి. అంకంపాలెం ఎంపీటీసీ అభ్యర్థిగా బుద్ధ రజిని నామినేషన్ దాఖలు

**విశాల భారతి, జీలుగుమిల్లి :** రజినీకి మాజీ ఎంపీటీసీ నాని శ్రీనివాస్ యాదవ్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు తోట బాలు మద్దతు తెలిపారు. ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం పి. అంకంపాలెం ఎంపీటీసీ అభ్యర్థిగా కూటమి నాయకులు బలపరిచిన బుద్ధ రజిని మూడో రోజు నామినేషన్ దాఖలు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సాయి బుచ్చారావుకు దాఖలు చేశారు. ఈ సందర్భంగా బుద్ధ రజినీకి మాజీ ఎంపీటీసీ నాని శ్రీనివాస్ యాదవ్, జీలుగుమిల్లి మండల బీసీ సెల్ అధ్యక్షుడు తోట బాలు తమ అభ్యర్థులను బలపరిచారు. కూటమి నాయకుల మద్దతుతో ఎంపీటీసీ అభ్యర్థిగా బరిలో నిలిచిన బుద్ధ రజిని నామినేషన్ కార్యక్రమం స్థానికంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

# ఎల్‌నినో ముప్పు ముంచుకొస్తున్నా.. ప్రభుత్వాలకు చీమకుట్టినట్లయినా లేదు!

- తక్షణమే కరువు సహాయక ప్యాకేజీ ప్రకటించాలి
- ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఐలయ్య

**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్**

ఎల్‌నినో ముప్పు పొంచి ఉందని వాతావరణ హెచ్చరికలు వెలువడుతున్నా.. కరువు తీవ్రత పెరుగుతున్నా.. రైతులు పంటలను కాపాడుకోలేక కన్నీరు పెడుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చలనం లేకపోవడం దారుణమని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఐలయ్య తీవ్రంగా విమర్శించారు. ముందస్తు చర్యలు చేపట్టాల్సిన పాలకులు సంక్షోభం ముదిరిన తర్వాత మేల్కొని ప్రకటనలు చేయడం తప్ప క్షేత్రస్థాయిలో రైతులను ఆదుకునేందుకు నిర్దిష్ట చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. కరువు పరిస్థితుల్లో రబీ పంటలు వేయవద్దని చెప్పడం సులభమేనని, కానీ పంటలపై ఆధారపడి బతికే రైతులు, వ్యవసాయ కూలీలు, గ్రామీణ పేదల ఆకలి తీర్చే బాధ్యత ప్రభుత్వాలకు లేదా అని నిలదీశారు.

**కరువు కత్తి.. రైతాంగంపై వేటు!**

రాష్ట్రంలో వర్షపాతం లోటు, జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గడం, భూగర్భ జలాలు అడుగంటడంతో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోతోందని ఐలయ్య ఆందోళన వ్యక్తం చేశారు. అక్టోబర్ 15 నాటికి రాష్ట్రంలో సాధారణ వర్షపాతం 740.6 మిల్లీమీటర్లు ఉండాల్సి ఉండగా 615.5 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైనట్లు గణాంకాలు చెబుతున్నాయని పేర్కొన్నారు. గత ఏడాదితో పోలిస్తే ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు గణనీయంగా తగ్గాయని, అనేక ప్రాంతాల్లో బావులు, బోర్లు ఎండిపోతుండటంతో పంటలు ఎండిపోయే దుస్థితి నెలకొందన్నారు. రాష్ట్రంలోని 18 జిల్లాల్లో 320 మండలాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నట్లు ప్రాథమిక గణాంకాలు వెల్లడిస్తున్నాయని, సుమారు 12 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అంచనాలు ఉన్నాయని తెలిపారు.



**ఎండుతున్న పంటలు.. ఎండమావిగా ప్రభుత్వ సాయం!**

పంటలకు నీరందక రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని, పెట్టిన పెట్టుబడి కూడా చేతికి రాకపోవడంతో అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని ఐలయ్య పేర్కొన్నారు. బావులు, బోర్లలో నీరు లేకపోవడం ఒకవైపు.. ఉన్న కొద్దిపాటి నీటిని పంటలకు అందించేందుకు విద్యుత్ కోతలు అడ్డంకిగా మారడం మరోవైపు రైతులను కుంగదీస్తున్నాయని విమర్శించారు. తక్కువ వోల్టేజీ కారణంగా వ్యవసాయ మోటార్లు కాలిపోతున్నాయని, పంటలను కాపాడుకోవడానికి రైతులు పడుతున్న ఆరాటాన్ని ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పంటలు ఎండిపోయిన తర్వాత సర్వేలు నిర్వహించడం, నివేదికలు రూపొందించడం వల్ల రైతులకు ఒరిగేదేమిటని ప్రశ్నించారు.

**కరువు వేళ కరెంటు చార్జీల భారమా?**

వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉన్న సమయంలో విద్యుత్ ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై అదనపు భారం మోపే చర్యలు దారుణమని ఐలయ్య విమర్శించారు. రూ.7,635 కోట్ల మేర రికవరీకి అనుమతి ఇచ్చి, అందులో రూ.5,420 కోట్లను ప్రజల నుంచి వసూలు చేసుకునే ప్రతిపాదనపై ప్రభుత్వం పునరాలోచించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా కల్పించి పంటలను కాపాడాల్సిన బాధ్యతను విస్మరించి, ప్రజల జేబులకు చిల్లులు పెట్టే విధానాలను అనుసరించడం సమంజసం కాదన్నారు.

**పరిశ్రమలకు నీళ్లు.. రైతులకు కరువు!**

వ్యవసాయ భూములు, నీటి వనరులను పరిశ్రమలకు కేటాయించే విధానంపై ప్రభుత్వం సమీక్ష నిర్వహించాలని ఐలయ్య డిమాండ్ చేశారు. డేటా సెంటర్లు, ఇథనాల్, ఇతర పరిశ్రమలకు నీరు, భూములు కేటాయిస్తూ.. వ్యవసాయ రంగానికి నీటి కొరత ఏర్పడితే రైతులు పంటలు వేయవద్దని సూచించడం పాలకుల ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. తాగునీరు, సాగునీటికి ప్రాధాన్యం ఇచ్చిన తర్వాతే ఇతర అవసరాలకు నీటి కేటాయింపులు జరగాలని స్పష్టం చేశారు.

**పంటల విరామం సరే.. కూలీల బతుకుల మాటేమిటి?**

రబీ సీజన్‌లో పంటలు వేయవద్దని ప్రభుత్వం సూచిస్తే, వ్యవసాయ కూలీలకు ఉపాధి ఎలా లభిస్తుందని ఐలయ్య ప్రశ్నించారు. సాగు నిలిచిపోతే రైతులే కాకుండా రోజువారీ కూలీ పనులపై ఆధారపడే లక్షలాది కుటుంబాలు జీవనోపాధి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. పంటల విరామం ప్రకటించే ముందు రైతులకు పరిహారం, కూలీలకు ఉపాధి, గ్రామీణ పేదలకు ఆహార భద్రతపై స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కరువు తీవ్రత పెరిగిన తర్వాత సర్వేల పేరుతో కాలయాపన చేయకుండా, తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని నిలదీశారు.

**తక్షణమే కరువు ప్యాకేజీ ప్రకటించాలి.**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా నిర్లక్ష్యాన్ని వీడి కరువు నివారణకు సమగ్ర కార్యాచరణ ప్రకటించాలని గౌని ఐలయ్య డిమాండ్ చేశారు. రైతు, రైతు కూలీ సంఘాలు, రాజకీయ పార్టీలతో అఖిల పక్ష సమావేశం నిర్వహించి కరువు పరిస్థితులపై చర్చించాలని కోరారు. పంటలు వేయలేని రైతులకు, పంటలు నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించాలని, పంట రుణాలను మాఫీ చేసి తదుపరి సాగుకు పెట్టుబడి సాయం కల్పించాలని సూచించారు. వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పనులు విస్తృతంగా చేపట్టాలని, గ్రామీణ పేదలకు ఆహార భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. పశుగ్రాసం, తాగునీటి కొరత నివారణకు ముందస్తు ఏర్పాట్లు చేయడంతో పాటు తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలకు ప్రోత్సాహకాలు అందించాలన్నారు. పట్టణాల్లోనూ తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

**పర్యావరణ విధ్వంసానికి అడ్డుకట్ట వేయాలి.**

అభివృద్ధి పేరుతో అడవులు, వ్యవసాయ భూములు, సహజ వనరులను ధ్వంసం చేయడం వాతావరణ సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తోందని ఐలయ్య హెచ్చరించారు. కాలుష్యకారక పరిశ్రమల నియంత్రణ, అటవీ సంరక్షణ, నీటి వనరుల పరిరక్షణపై ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎల్‌నినో వంటి వాతావరణ పరిణామాలను ఎదుర్కోవడానికి శాస్త్రీయ ప్రణాళికలు, దీర్ఘకాలిక పర్యావరణ పరిరక్షణ చర్యలు అవసరమన్నారు. ప్రకటనలతో కాదు.. పరిహారంతో రైతులను ఆదుకోవాలి. సర్వేలతో కాదు.. సహాయక చర్యలతో కరువును ఎదుర్కోవాలి. పంటల విరామం పేరుతో రైతులను, కూలీలను గాలికి వదిలేయకుండా వారి జీవనోపాధికి ప్రభుత్వం భరోసా కల్పించాలి. లేనిపక్షంలో రైతాంగం, కార్మిక వర్గం, గ్రామీణ పేదల తరపున పోరాటాలను ఉధృతం చేస్తామని గౌని ఐలయ్య హెచ్చరించారు.

# రోడ్ ట్రిప్ నేపథ్య కథాంశంతో..

'ఒకే ఒక జీవితం'ఫేం శ్రీకార్తీక్ దర్శకత్వంలో రుక్మిణి వసంత్ కథానాయికగా ఓ చిత్రం తెరకెక్కనున్నది. రోడ్ ట్రిప్ నేపథ్యంలో కామేడీ డ్రామా ఇది. సిరుని సినీ కార్పొరేషన్, మ్యాడ్‌బాయ్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన అనౌన్స్‌మెంట్ వీడియోను మేకర్స్ విడుదల చేశారు. ఇందులో రుక్మిణి వసంత్ 'తారా' అనే పాత్రలో నటిస్తున్నట్టు ఈ వీడియో ద్వారా పేర్కొన్నారు. దర్శకుడు శ్రీకార్తీక్, నటులు దేవ్ రామనాథ్, వినాయక్ వైద్యనాథన్‌లు సరదాగా సంభాషించుకుంటూ తారగా రుక్మిణి వసంత్‌ను పరిచయం చేశారు. ఏడాదిన్నరగా సాగిన ఈ సినిమా ప్రయాణాన్ని ప్రతిబింబించేలా ఈ అనౌన్స్‌మెంట్ వీడియో సాగింది. త్వరలోనే ఈ సినిమా టైటిల్‌ను కూడా ప్రకటించనున్నారు.



Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.